టాప్ న్యూస్


## అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు



- సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్
- చిన్నారులపై లైంగిక దాడుల నివారణపై హైదరాబాద్‌లో సదస్సు

02

## కొందరి చేతుల్లోనే సంపద ఉండకూడదు



- దేశంలో సంపద వికేంద్రీకరణ జరగాలి
- నితిన్ గడ్కరీ

02

## నేడే తొలి ఏకాదశి.. భక్తుల భక్తి పారవశ్యం

- విష్ణుని శయనానికి శుభారంభం నేడే
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శయనోత్సవాలకు సిద్ధం
- ఉపవాసాలు, భజనలు... ఏకాదశి ఉత్సాహం
- చతుర్మాసానికి తొలి అడుగు ఏకాదశి



02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

06-07-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 213 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## రసవత్తర రాజకీయాలు

తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఎఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సభ అనంతర పరిణామాలు అధికార కాంగ్రెస్ పార్టీలో హాట్ హాట్ గా మారాయి. బిజెపి స్టేట్ చీఫ్ గా ఊహించని రీతిలో ఎన్. రామచందర్ రావు ను ఎంపికచేసి ఆశావహ ఎంపీలకు హైకమాండ్ షాకిచ్చింది. ఈ ఎంపిక వెనుక చక్రం తిప్పినవారు.. చిత్తయిన వారిపై చర్చ సహజం. బిఆర్ఎస్ పార్టీ లో కవిత రైలు ఢిల్లీ దిశగా పరుగులు పెడుతుండగా, గులాబీ క్యాడర్ లో ఇది హాట్ టాపిక్ గా మారింది. అంతర్జాతీయంగా భారత వైఖరి, విదేశాంగ విధానంలో లోపాలు ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి.


- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో

# తెలంగాణ మహిళలకు మరో తీపి కబురు

## ల్యాండ్ రిజిస్ట్రేషన్లలో స్టాంప్ డ్యూటీ తగ్గింపు యోచన

- కొత్త స్టాంప్ విధానం రూపకల్పనకు కసరత్తు
- వచ్చే శాసనసభ సమావేశాల్లో బిల్లు
- పాత అపార్ట్‌మెంట్‌లకు స్టాంప్ డ్యూటి వెసులుబాటు
- ముఖ్యమంత్రి రేవంత్ తో చర్చించి తుది నిర్ణయం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని భారతీయ స్టాంపు చట్టం 1899ను అనుసరించి తెలంగాణ సవరణ బిల్లు2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుపై శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్. లోకేష్ కుమార్, న్యాయవ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఒఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో



# మహిళా సాధికారతలో తెలంగాణ రోల్ మోడల్

## 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవంలా వడ్డీ లేని రుణాలు

### ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మహా :** మహిళా సాధికారతలో తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్ గా నిలవాలని, దేశం అంతా తెలంగాణ రాష్ట్రానికి వచ్చి చూసేలా ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళా సంఘాలు అందిపుచ్చుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ప్రజాభవన్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మహిళా సంఘాలకు ఆర్టీసీ నుంచి రావాల్సిన అద్దె చెక్కులను అందజేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలను మహా రాణులుగా గౌరవించుకోవాలని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు పోతుందన్నారు. మహిళా సంఘాలు లాభాలు ఆర్జించి వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని బాగా ఎదగాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం 10 సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ నేతలు వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాలకు ప్రోత్సాహకాలను గాలికి వదిలేసారని విమర్శించారు.

మిగతా 2లో



## మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం

- ముంబయిలో ఠాక్రే బ్రదర్స్ సంయుక్త సభ
- 20 ఏళ్ళ తర్వాత కలిసిన బ్రదర్స్
- ఫడ్నవిస్ వల్లే సాధ్యమైందంటూ చురక

**ముంబై, మహా:** దాదాపు 20 ఏళ్ల తర్వాత శివసేన యూబీటీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే ఒకే రాజకీయ వేదికపైకి చేరుకున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేస్తూ తెచ్చిన త్రిభాషా విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో ముంబయిలో నిర్వహించిన మెగా

మిగతా 3లో

## 2028 ఎన్నికల్లో 90 సీట్లు మావే..

### బీజేపీ కొత్త చీఫ్ రాంచందర్ రావు



**హైదరాబాద్:** 'పార్టీ కోసం నేను చేసిన కృషికి నాకు దక్కిన గౌరవం ఇది. నాకు ఇచ్చింది పదవి కాదు. కార్యకర్తకు దక్కిన గౌరవం ఇది. లక్షలాది మంది కార్యకర్తలకు దక్కిన గౌరవం ఇది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్ రావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 45 లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ అని తెలిపారు. బీజేపీ సుదీర్ఘ ప్రయాణంలో ఎంతోమంది కార్యకర్తల త్యాగం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా 14 కోట్ల సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ అని అన్నారు.

మిగతా 3లో



## చర్చకు రెడీ

### 72 గంటల్లో రా.. తేల్చుకుందాం..

**8న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సిద్ధంగా ఉంటా**
**సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్**

**హైదరాబాద్, మహా :** రైతు సంక్షేమం గురించి చర్చించేందుకు తెలంగాణలో ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 72 గంటల్లో రా.. తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు సిద్ధమని చెప్పారు. చర్చకు మూడు రోజుల సమయం ఇస్తున్నామని, ప్రిపేర్ అయ్యి రావాలన్నారు. పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో రైతు రాజ్యం తెచ్చింది కేసీఆర్. రైతు కేంద్రంగా ప్రభుత్వాన్ని నడిపింది బీఆర్ఎస్. నిజం తెలిసినా ఒప్పుకోలేని వ్యక్తి రేవంత్ రెడ్డి. సభ పెడితే బూతులు మాట్లాడుడే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నాడు. రైతు సంక్షేమంపై రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చ పెట్టినా మేం రెడీ. 72 గంటలు సమయం ఇస్తున్నామని చర్చకు రావాలన్నారు.



## డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం ఏంటి?

సొంత చెల్లే నిన్ను నాయకుడిగా గుర్తించట్లే
కేటీఆర్ పై మంత్రి సీతక్క ఫైర్

వివరాలు 2లో

## అసెంబ్లీకి రమ్మంటే.. ప్రెస్ క్లబ్‌కు రమ్మంటున్నారు

- కేసీఆర్ సభకు ఎందుకు రావట్లే?
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



వివరాలు 2లో

## ఆదాయ సమానత్వంలో భారత్ సత్తా

- ప్రపంచంలోనే 4వ స్థానం
- అమెరికా, చైనా, జీ7, జీ20 దేశాలను అధిగమించిన వైనం
- ప్రపంచ బ్యాంకు తాజా గిని సూచీ గణాంకాలలో వెల్లడి

02

## మంత్రికే ఫేక్ లెటర్

- మావోయిస్టుల పేరిట సీతక్కపై విమర్శలు
- తాము రాయలేదంటూ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ

వివరాలు 2లో

## హైడ్రా కూల్చివేతపై హైకోర్టు ఆగ్రహం

### ఎఫ్‌టిఎల్ ను ఏకపక్షంగా నిర్ణయించవద్దు

- తగిన ప్రక్రియ లేకుండా కూల్చివేతలు అన్యాయమన్న ధర్మాసనం
- ఇకపై కూల్చివేతలు చేపట్టవద్దు

02





# తెలంగాణ మహిళలకు మరో తీపి కబురు

(మొదటిపేజీ తరువాయి)

భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను మరియు 26 ఆర్టికల్స్ ను సవరించుట కొరకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి భారత ప్రభుత్వం ఆమోదం కొరకు పంపడం జరిగిందని అయితే ఈ బిల్లుపై భారత ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్దత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్దం చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏపి ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతబద్దంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు.

**మహిళలకు గుడ్ న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్ లకు స్టాంప్ డ్యూటీ ఒకే విధంగా ఉందని పాత అపార్ట్ మెంట్‌లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

# మహిళా సాధికారతలో తెలంగాణ రోల్ మోడల్

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి వడ్డీ లేని రుణాలను ప్రారంభించి మహిళా సంఘాలను ప్రోత్సహించి వారితో ప్రత్యేకంగా వ్యాపారాలు చేయిస్తుందని తెలిపారు.

హైదరాబాద్ నగరం నడిబొడ్డున లక్షలాదిమందితో సభ నిర్వహించి ఇప్పటికే రెండుసార్లు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేశామని గుర్తు చేశారు. మరోసారి వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఉత్సవంలా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీ లేని రుణాల ద్వారా లభించిన పెట్టుబడులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఏ ఏ వ్యాపారాలు చేయాలి అనే అంశంపై ఈనెల ఏడు నుంచి తొమ్మిది వరకు జిల్లా, మండల, గ్రామ శాఖ స్థాయిలో మహిళా సంఘాలు సమావేశమై చర్చించుకోవాలని వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం అందిస్తున్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని మహిళా సంఘాలకు సూచించారు. మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి ఆ బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇప్పించాం, మొదటి దశలో కోటి రూపాయల అద్దెను ఈరోజు మహిళా సంఘాలకు ఆర్టీసీ ద్వారా అందజేయడం ఒక గొప్ప శుభ పరిణామం అని డిప్యూటీ సీఎం హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆర్టీసీ నుంచి పెద్ద ఎత్తున రాబడులు మహిళా సంఘాలకు అందుతాయని, త్వరలోనే వాటిని ప్రకటిస్తామని తెలిపారు.



మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో విద్యుత్ శాఖ మహిళా సంఘాలతో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు చేసుకున్న విషయాన్ని డిప్యూటీ సీఎం వివరించారు. మహిళా సంఘాల ద్వారా 1,000 మెగావాట్లకు తగ్గకుండా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఒప్పందాలు జరిగాయని తెలిపారు. రాష్ట్రంలో అవకాశం ఉన్న ప్రతి దగ్గర క్యాంటీన్లు, పాఠశాలల మరమ్మత్తులు, విద్యార్థుల స్కూల్ డ్రెస్సులు కుట్టడం వంటి పనులను మహిళా సంఘాలకు ఇచ్చి వారిని ఆర్థికంగా ప్రజా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహిళా సంఘాలు తీసుకున్న వడ్డీ లేని రుణాలు ఎక్కడ పెట్టుబడి పెట్టాలి, ఎలాంటి వ్యాపారాలు చేయించాలి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన వస్తువులను తిరిగి ప్రభుత్వమే కొనుగోలు చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు అందులో భాగంగా మొదటి సంవత్సరం 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించాం, ప్రతి ఏటా 20 వేల కోట్లకు తగ్గకుండా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈనెల 10 నుంచి 18 వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజలందరి సమక్షంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కేవలం వడ్డీ లేని రుణాలే కాదు బ్యాంకు లింకేజ్, లోన్ బీమా, ప్రమాద బీమా వంటి సౌకర్యాలు స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మనందరిదీ సమాజంలో కుటుంబ వ్యవస్థ ప్రధానమైనది ఆ వ్యవస్థను నడిపేది మహిళ వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తే రాష్ట్రం, ప్రజలు తలెత్తుకుని జీవించే పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడుతుందని తెలిపారు.

# హైడ్రా కూల్చివేతపై హైకోర్టు ఆగ్రహం

## ఎఫ్ టి ఎల్ ను ఏకపక్షంగా నిర్ణయించవద్దు

### తగిన ప్రక్రియ లేకుండా కూల్చివేతలు అన్యాయమన్న ధర్మాసనం

### ఇకపై కూల్చివేతలు చేపట్టవద్దు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని సున్నం చెరువులో ఇళ్ల కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు మరోసారి హైడ్రాపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్ల కూల్చివేతను ధర్మాసనం తీవ్రంగా ఖండించింది. నిర్మాణాలు అక్రమమైనా, నిబంధనల ప్రకారం తొలగించాల్సిందేనని కోర్టు స్పష్టం చేసింది. నీళ్లు వస్తున్నాయని కూల్చివేస్తూ పోతే.. హైదరాబాద్‌లోని చాలా నిర్మాణాలు పూర్తిగా నేలమట్టమవుతాయని పేర్కొంది. FTL ని ఏకపక్షంగా నిర్ణయించకూడదని కూడా సూచించింది.

**నోటీసుల్లేకుండానే ఇళ్లను కూల్చివేతలు**

సున్నం చెరువు సమీపంలోని ఇళ్ల కూల్చివేత బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. అక్రమ నిర్మాణాల తొలగింపు పేరుతో హైడ్రా తమ ఇళ్లను కూల్చివేసిందని, ఎటువంటి నోటీసు ఇవ్వకుండా, అధికారిక సర్వే లేకుండానే కూల్చివేసిందని వారు ఆరోపించారు. ఇళ్లు అకస్మాత్తుగా కూల్చివేయడంతో తాము నిరాశ్రయులయ్యామని వాపోయారు. పిటిషనర్లు సమర్పించిన పత్రాలను పరిశీలించిన హైకోర్టు, అవన్నీ చెల్లుబాటు అయ్యేవని వ్యాఖ్యానించింది. ఇంటిని కూల్చివేయడానికి ఒక స్పష్టమైన ప్రక్రియ ఉంటుందని కోర్టు గుర్తు చేసింది. అధికారులు ఆ ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇకపై కూల్చివేతలు చేపట్టవద్దని కోర్టు హైడ్రాను ఆదేశించింది. అదనంగా, సున్నం చెరువు చుట్టుపక్కల ప్రాంతాలలో చెరువు పునరుద్ధరణ పనులకు అనుమతి కోసం అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని కోర్టు హైడ్రాను ఆదేశించింది. హైడ్రా నిబంధనలను పాటిస్తున్నదా లేదా అని పర్యవేక్షించడానికి కోర్టు తదుపరి విచారణను 17కు వాయిదా వేశారు.

# అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు

- సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ వార్నింగ్
- చిన్నారులపై లైంగిక దాడుల నివారణపై హైదరాబాద్‌లో సదస్సు

**హైదరాబాద్, మహా:** చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి అత్యంత కఠినమైన శిక్షలు తప్పవని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శనివారం "లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత" అనే అంశంపై నిర్వహించిన ఒక సదస్సులో ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులపై జరిగే లైంగిక హింసను సమాజంలో ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. బాధితులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. వాటి ద్వారా బాధితులకు పూర్తి భద్రత, సహకారం అందిస్తున్నామని వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రజలు, ముఖ్యంగా యువత సోషల్ మీడియా వాడకం విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ కీలకమైన సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఆదాయ సమానత్వంలో భారత్ సత్తా

## ప్రపంచంలోనే 4వ స్థానం

- అమెరికా, చైనా, జీ7, జీ20 దేశాలను అధిగమించిన వైనం
- ప్రపంచ బ్యాంకు తాజా గిని సూచీ గణాంకాలలో వెల్లడి

**మహా:** ఆదాయ సమానత్వం విషయంలో భారతదేశం ప్రపంచంలోనే ఒక ఆదర్శవంతమైన దేశంగా నిలుస్తోంది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఆదాయ పంపిణీలో అసమానతలను కొలిచే 'గిని సూచీ'లో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించి, ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలిచింది. స్లోవాక్ రిపబ్లిక్, స్లోవేనియా, బెలారస్ మాత్రమే భారత్ కంటే ముందున్నాయి. అమెరికా, చైనాతో పాటు జీ7, జీ20 కూటమిలోని అన్ని అగ్ర దేశాలను భారత్ వెనక్కి నెట్టడం విశేషం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, భారత్ 'గిని సూచీ' స్కోరు 25.5గా నమోదైంది. ఇదే సమయంలో చైనా (35.7), అమెరికా (41.8) వంటి దేశాలు భారత్ కంటే చాలా వెనుకబడి ఉన్నాయి. 2011లో 28.8గా ఉన్న 'గిని' స్కోరు ఇప్పుడు గణనీయంగా మెరుగుపడటం, దేశ ఆర్థిక ప్రగతి ఫలాలు ప్రజలందరికీ సమానంగా అందుతున్నాయన డానికి నిదర్శనమని సాంఘిక సంక్షేమ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

**పేదరికాన్ని తగ్గిస్తున్న ప్రభుత్వాలు**

ఈ ఘనత వెనుక దేశంలో పేదరికాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న స్థిరమైన విధానాలే ప్రధాన కారణమని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో స్పష్టం చేసింది. 2011 నుంచి 2023 మధ్యకాలంలో దేశంలో సుమారు 17.1 కోట్ల మంది తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపింది. ఇదే సమయంలో, రోజుకు 2.15 డాలర్ల ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుంటే, దేశంలో పేదరికపు రేటు 16.2 శాతం నుంచి కేవలం 2.3 శాతానికి పడిపోయింది. ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన ద్వారా 55 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరవడం, ఆధార్ ద్వారా 142 కోట్ల మందికి ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) సేవలు అందించడం వంటి కార్యక్రమాలు ఈ మార్పునకు దోహదపడ్డాయి. డీబీటీ ద్వారా మార్చి 2023 నాటికి రూ.3.48 లక్షల కోట్లు ఆదా అయినట్లు నివేదిక వెల్లడించింది. వీటితో పాటు, ఆయుష్మాన్ భారత్ కింద 41 కోట్ల మందికి ఆరోగ్య రక్షణ, పీఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా 80 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించడం వంటి పథకాలు కూడా ఆదాయ సమానత్వాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించాయి.

# కొందరి చేతుల్లోనే సంపద ఉండకూడదు

### దేశంలో సంపద వికేంద్రీకరణ జరగాలి : నితిన్ గడ్కరీ

**మహా:** దేశంలో సంపద వికేంద్రీకరణ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చూడాలని, అది అందరికీ చేరేలా చర్యలు తీసుకోవడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశాభివృద్ధిలో వ్యవసాయ రంగం, తయారీ పరిశ్రమల ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. అదేవిధంగా, పన్నుల విధానం, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) వంటి విషయాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ అంశాలపై చర్చిస్తూనే, ఆర్థిక అసమానతలను తగ్గించడానికి సంపద వికేంద్రీకరణే సరైన మార్గమని ఆయన సూచించారు. దేశంలో పేదలు పెరుగుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంపద కొద్దిమంది చేతుల్లో పోగుపడుతోందని వ్యాఖ్యానించారు.

# నేడే తొలి ఏకాదశి.. భక్తుల భక్తి పారవశ్యం


## విష్ణుని శయనానికి శుభారంభం నేడే

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శయనోత్సవాలకు సిద్ధం

### ఉపవాసాలు, భజనలు... ఏకాదశి ఉత్సాహం

### చతుర్మాసానికి తొలి అడుగు ఏకాదశి

**ఖమ్మం, మహా.** ఆషాఢ శుద్ధ ఏకాదశిగా పరిగణించబడే "దేవశయనీ ఏకాదశి" ఈ సంవత్సరం జూలై 6వ తేదీన ఉదయం నుంచి రాత్రి వరకు జరగనుంది. హిందూ సంప్రదాయాల్లో అత్యంత పవిత్రంగా భావించే ఈ దినం భక్తుల జీవితాల్లో ఆధ్యాత్మిక శుద్ధికి ప్రతీకగా నిలుస్తుంది. పురాణాల ప్రకారం ఈ రోజు శ్రీమహావిష్ణువు పాలసముద్రంలో శేషతలంపై శయనంలోకి వెళతాడని విశ్వాసం. ఈ శయనోత్సవం అనంతరం నాలుగు నెలల పాటు భగవంతుడు యోగనిద్రలో ఉంటాడని భావిస్తారు. అదే "చతుర్మాసం". ఈ కాలంలో వివాహాలు, గృహప్రవేశాలు, శుభకార్యాలు జరపకూడదు అనే ఆచారం ఉన్నది. ఈ ఏకాదశి నాడు బ్రహ్మ ముహూర్తంలో భక్తులు లేచి పవిత్ర స్నానాలు చేసి, విష్ణుసహస్రనామ పారాయణ, తులసీదళ పూజ, ఉపవాస దీక్షలతో భగవంతుని పూజిస్తారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, శయనోత్సవాలు జరుగుతాయి. ప్రజలు ఈ రోజును ఉపవాసంతో గడిపి, రోజు ద్వాదశి తిథిలో పరాణం (ఉపవాస విరమణ) చేస్తారు. పరాణానికి అనుకూలమైన సమయం జూలై 6 ఉదయం 5.29 గంటల నుంచి 8.16 గంటల మధ్యగా నిర్ణయించబడింది. ఈ సందర్భంగా పుణ్యక్షేత్రాలైన పండరపురం, శ్రీరంగం, యాదాద్రి, భద్రాచలం, ముక్తిగిరి వంటి ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తుతున్నారు. ఆలయాల వద్ద ప్రత్యేక శోభాయాత్రలు, నామసంకీర్తనలు, గీతారామాయణ ప్రవచనాలతో ఆలయాలు భక్తిరసంతో మార్మోగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ రోజున పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయంగా "పేలాల పిండి" తినే ఆచారం కనిపిస్తుంది. ఇది వర్షాకాల రోగనిరోధకతను పెంచుతుందన్న నమ్మకం ఉంది. పురాణాలలోని కథనాల ప్రకారం మహాబలుడు బలిచక్రవర్తిని విష్ణువు వామన రూపంలో పాతాళలోకి పంపి అక్కడ అతనికి విష్ణు శయనంగా ఉండే వరం ఇచ్చాడన్నది ప్రసిద్ధం. అందువల్లే శయనోత్సవాన్ని పాతాళ సంబంధంగా కూడా భావిస్తారు. అలాగే రాజు మండాత వ్రతాచరణల ఫలితంగా తన రాజ్యంలో వర్షాభివృద్ధి చేకూరిందన్నది మరో విశేష పురాణగాథ.



ఈ పర్వదినాన్ని అత్యంత పవిత్రంగా భావించే భక్తులు ఉపవాసం ద్వారా తమ పాపాలను తుడిచేసుకోవాలనే తపనతో ఆచరిస్తుంటారు. దేవశయనీ ఏకాదశితో ప్రారంభమయ్యే చతుర్మాసంలో పూజలు, పారాయణాలు, సాధనలు, తపస్సులు మొదలవుతాయి. ముఖ్యంగా కార్తీక మాసం వరకు ఈ కాలాన్ని ఆధ్యాత్మిక దీక్షల కాలంగా భావిస్తారు. చతుర్మాసం ముగిసే రోజు "ఉత్తాన ఏకాదశి"గా ప్రసిద్ధి చెందింది. శ్రీహరి మేలుకొని తిరిగి భక్తులకు దర్శనమివ్వడాన్ని పురస్కరించుకొని ఆ రోజు భక్తులు దీపోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో రేపు జరగబోయే తొలి ఏకాదశిని పురస్కరించుకొని భక్తులు ఇంటా బయటా భగవన్నామ స్మరణతో విరాజిల్లుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రాలకు భక్తుల తరలింపు పెరిగింది. రాత్రి సమయంలో ఆలయాల్లో శయనోత్సవాన్ని ఘనంగా నిర్వహించే ఏర్పాట్లు పూర్తయ్యాయి. పూజారి వర్గాలు, ఆలయ ట్రస్టు బోర్డులు భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆధ్యాత్మికంగా, శరీర శుద్ధిగా, మనోనిల్వగా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఏకాదశి పాటించబడుతోంది. ఉపవాసం ద్వారా శరీరంలోని విషపదార్థాలు కరిగిపోవడం, పూజాపఠనాల ద్వారా మనశ్శాంతి కలగడం వంటివి దీనివల్ల కలుగుతాయని పండితులు చెబుతున్నారు. మన ఆచారాలు, సంప్రదాయాలు ఎంత ఆరోగ్య ప్రదమైనవో అర్థం చేసుకునే సందర్భమిది. దేవుని యోగనిద్రలోకి తీసుకువెళ్తున్న తొలి అడుగుగా ఈ ఏకాదశి భావించబడుతుంది.

# మంత్రికే ఫేక్ లెటర్

- మావోయిస్టుల పేరిట సీతక్కపై విమర్శలు
- తాము రాయలేదంటూ మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ

**హైదరాబాద్, మహా :** మంత్రి సీతక్కపై ప్రకటన తాము చేయలేదని మావోయిస్టు పార్టీ సంచలన ప్రకటన చేసింది. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో గత నెల 26న మంత్రి సీతక్కపై వచ్చిన పత్రిక ప్రకటనకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని మావోయిస్టుల అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ ఇచ్చారు. ఆ లేఖలో సీతక్కను మహిళ అని కూడా చూడకుండా సిగ్గు పడాలంటూ పేర్కొనడం కొంత అనుమానాస్పదంగానే కనిపించింది. జీవో 49 అంశాన్ని ప్రస్తావించారు. ఆదివాసీ బిడ్డగా, మాజీ నక్సలైట్‌గా ప్రాచుర్యం పొందిన మంత్రి సీతక్క సొంత నియోజకవర్గంలో ఈవిధంగా జరగడం సిగ్గుచేటు, అవమానకరమని పేర్కొన్నారు. దీనిపై సీతక్క మీడియాతో మాట్లాడారు. ఇది మావోయిస్టులు రాసిన లేఖ కాదంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఈ లేఖపై మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ ఇవాళ క్లారిటీ ఇచ్చారు. ఆ లేఖ తాము రాయలేదని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులను మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదంటూ జూన్ 26న విడుదలైన ప్రకటనతో తమకు సంబంధం లేదని పేర్కొన్నారు. దీంతో ఆ లేఖ రాసిందెవరు..? ఎలా మీడియాకు వచ్చింది. ఏయే వాట్సాప్ గ్రూపుల ద్వారా సర్క్యులేట్ అయ్యింది.. దీని వెనుక ఎవరున్నారు..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

**పేదలకు దన్నుగా సీతక్క**

మంత్రి సీతక్క పేదలపక్షాన, గిరిజనుల పక్షాన అనేక పోరాటాలు చేయడంతో పాటు ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకురాలిగా, మంత్రిగా సేవ చేస్తున్నారు. అట్టడుగువర్గాల సంక్షేమానికి పాటుపడే నేతగా సీతక్కకు పేరుంది.

# డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం ఏంటి?

### సొంత చెల్లే నిన్ను నాయకుడిగా గుర్తించట్లే.. కేటీఆర్ పై మంత్రి సీతక్క ఫైర్

**హైదరాబాద్, మహా:** డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం విడ్డూరంగా ఉంది. నీ డెడ్ లైన్ కోసం ఇక్కడ ఎవరు ఎదురుచూడటం లేదు అంటూ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో కేటీఆర్ పై ఫైర్ అయ్యారు. రైతు సంక్షేమంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 8 వ తేదీన చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డి కి సవాల్ చేయగా, ఈ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క కౌంటర్ ఇచ్చారు. శనివారం ఆమె ప్రజాభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ కేటీఆర్‌కు అర్థం కానట్లు ఉందని విమర్శించారు. కేటీఆర్ గుర్తింపు సమస్యతో బాధపడుతున్నాడని, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదన్నారు. అసెంబ్లీలో చర్చిద్దాం రా అంటే.. ప్రెస్ క్లబ్ కు రమ్మనడం ఏంటి? అని ప్రశ్నించారు. ప్రజలు ఎమ్మెల్యేలుగా ఎన్నుకున్నది ప్రెస్‌క్లబ్‌లో చర్చించడానికి కాదని చెప్పారు. 72 గంటల డెడ్‌లైన్ అంటూ అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. డెడ్ అయిన పార్టీ డెడ్ లైన్ పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా ఉన్న మీ నాన్నను అసెంబ్లీకి రమ్మను చర్చిస్తాం.. అని సీతక్క మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డారు.



# అసెంబ్లీకి రమ్మంటే.. ప్రెస్ క్లబ్ కు రమ్మంటున్నారు

## కేసీఆర్ సభకు ఎందుకు రావట్లే?.. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి చర్చ కోసం అసెంబ్లీకి రమ్మంటే కేటీఆర్ మాత్రం ప్రెస్ క్లబ్ కు రమ్మంటున్నారని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. అసెంబ్లీ పెట్టాలని ఎక్కడైనా ప్రతిపక్ష నేత కోరుతారు. కానీ తెలంగాణలో మాత్రం పరిస్థితి రివర్స్‌లో ఉందని అన్నారు. అసెంబ్లీలో చర్చకు రాకుంటే ఇక అసెంబ్లీ ఎందుకు? ప్రజలు ఓట్లేసి బీఆర్ఎస్ ను గెలిపించడం ఎందుకు అని ప్రశ్నించారు. శనివారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి.. కేటీఆర్, హరీష్ సెకండ్ బెంచ్ లీడర్లని కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య సెకండ్ బెంచ్ లీడర్స్ ఎందుకు వస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సభకు రావాలని రేవంత్ రెడ్డి బొట్టు పెట్టి పిలుస్తుంటే ఎందుకు రావడం లేదని నిలదీశారు. ఉద్యమ సమయంలో ఆంధ్ర ప్రజలను పొడుస్తానన్న బీఆర్ఎస్సే అధికారంలోకి వచ్చాక వారి కాళ్లకు ముళ్లు గుచ్చుకుంటే పంటితో తీస్తామన్న సంగతి మర్చిపోవద్దని జగ్గారెడ్డి దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్ కుటుంబం ఆంధ్ర ప్రజలను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూ అధికారంలోకి వచ్చింది.

ఆతర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు రాగానే బీఆర్ఎస్ ఫ్లేట్ ఫిరాయించింది. తెలంగాణ నీళ్లు తరలించుకుపోయిన నీటి దొంగలను కేసీఆర్ ఎందుకు తన నివాసానికి పిలిచి భోజనం పెట్టారని ప్రశ్నించారు. మీరు ఇక్కడ కోడి పులుసు తినిపిస్తే వాళ్లు మీకు చేపల పులుసు తినిపించారు. మీ పులుసుల కథ బాగానే ఉందని.. మధ్యలో తెలంగాణ ప్రజలు ఎలా కనిపిస్తున్నారని ప్రశ్నించారు.

# 2028 ఎన్నికల్లో 90 సీట్లు మావే..

## బీజేపీ కొత్త చీఫ్ రాంచందర్ రావు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ , బీఆర్ఎస్‌లపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ , కాంగ్రెస్‌లు రైతులను , విద్యార్థులను , నిరుద్యోగులను, మహిళలను మోసం చేసాయని మండిపడ్డారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన నిస్సహాయతను ఒప్పుకున్నారన్నారు. రైతాంగాన్ని మోసం చేస్తే వాళ్ళ ఉసురు తగులుతుందని వ్యాఖ్యలు చేశారు. 2028 ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని సీఎం అంటున్నారని, అంతవరకు ఎందుకు లోకల్ బాడీ ఎన్నికల్లో ప్రజాభిప్రాయం ఏమిటన్నది స్పష్టమవుతుందన్నారు. స్థానిక ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతాంగానికి సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దీని మీద బీజేపీ చర్చకు సిద్ధమని.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ మీద ఆరోపణలు చేసే ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పునరాలోచన చేసుకోవాలని హితవు పలికారు. ఖర్గే, రేవంత్ , కాంగ్రెస్ పెద్దలు తెలుసుకోవాల్సిన విషయం ఏంటంటే ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా చీటింగ్ కమిటీ అంటూ కామెంట్స్ చేశారు. 2028 ఎన్నికల్లో గెలిచేది బీజేపీయేనని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణాలో బీజేపీకి ప్రజలు 90 సీట్లు ఇవ్వబోతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు రెండే అని అన్నారు. గ్రేటర్ లోనూ బీజేపీ తన సత్తాను చాటుకుంటుందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలదంటూ విరుచుకుపడ్డారు. రాబోయే రోజుల్లో బీజేపీని మరింత బలపేతం చేసేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలంతా కలిసి పని



చేయాలని, అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎలుగెత్తి చాటాలని పిలుపునిచ్చారు. రైతు భరోసాపై ఇంతకాలం రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్ కేవలం స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైతు భరోసా డబ్బులు వేశారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత పని తీరును రైతాంగం పూర్తి స్థాయిలో గమనిస్తుందన్నారు. రాష్ట్ర రైతులకు సరిపోయేంత యూరియాను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సరఫరా చేస్తే క్షేత్ర స్థాయిల రైతులకు అందించడంలో రేవంత్ సర్కార్ వైఫల్యం చెందిందన్నారు. స్థానిక ఎన్నికలే తన మొదటి టాస్క్ అని పేర్కొన్న రాంచందర్ రావు తన టాస్క్ లో పూర్తి స్థాయిలో విజయం సాధిస్తానన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

### అట్టహాసంగా బాధ్యతల స్వీకరణ

శనివారం ఉదయం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ముందు రామచందర్ రావు చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీగా కార్యకర్తలు, నేతలు, అభిమానులు తరలి వచ్చారు. అక్కడి నుంచి భార కాన్వాయ్ తో అసెంబ్లీ ఎదురుగా ఉన్న తెలంగాణ అమర వీరుల స్మారక స్థంపం వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. ఆ తర్వాత ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలను స్వీకరించారు. రాంచందర్ రావు బాధ్యతల స్వీకార కార్యక్రమానికి ఇప్పటి వరకు అధ్యక్ష బాధ్యతలను నిర్వహించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు ఎంపీలు డీకే అరుణ, పైడి రాకేష్ రెడ్డి తదితరులతో పాటు పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా అభిమానులు భారీ ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

# మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం

- ముంబయిలో ఠాక్రే బ్రదర్స్ సంయుక్త సభ
- 20 ఏళ్ళ తర్వాత కలిసిన బ్రదర్స్
- ఫడ్నవిస్ వల్లే సాధ్యమైందంటూ చురక

(మొదటిపేజీ తరువాయి)

విజయోత్సవ సభలో ఇరువురు నేతలు పాల్గొన్నారు. మరాఠీ తమ హక్కు అని ఇరువురు నేతలు ఉద్ఘాటించారు. మహాయుతి సర్కారు రాష్ట్రంలో హిందీ భాషను అమలు చేయిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఈ సభను ఇరుపార్టీలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. కలిసి ముందుకు సాగేందుకే తన సోదరుడు రాజ్ ఠాక్రేతో తాను కలిసిపోయామని శివసేన (ఉద్ధవ్) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ఇప్పుడు అందరి చూపు తమ ఇద్దరు సోదరులపైనే ఉందని, ప్రతి ఒక్కరు తమ ప్రసంగాల కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ సభను తాము ప్రకటించినప్పటి నుంచి ప్రతీ ఒక్కరు ఆతుర్తగా రాజ్‌ఠాక్రే ప్రసంగం కోసం ఎదురు చూస్తున్నారని ఉద్ధవ్ చెప్పుకొచ్చారు. రాజ్ గొప్ప వక్త అని, ఆయన ప్రసంగాలు అమోఘంగా ఉంటాయని కితాబిచ్చారు. అందుకే తాను ఇక మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. తన దృష్టిలో తమ ఇద్దరి ప్రసంగాల కంటే ఈ సభే చాలా ముఖ్యమైందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు.

**మహారాష్ట్రకు అన్యాయం**

గత 11 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంబయికి, మహారాష్ట్రకు ఏం చేశాయని ఉద్ధవ్ ప్రశ్నించారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ద్వారా శివసేన (ఉద్ధవ్) చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అందరికీ తెలుసన్నారు. ముంబయిలోని ప్రముఖ పరిశ్రమలను సైలెంట్‌గా గుజరాత్‌కు తరలించుకుపోయారని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర వెన్ను విరిచే ప్రణాళికలో భాగంగానే ఇలాంటివన్నీ చేస్తున్నారని ఉద్ధవ్ మండిపడ్డారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కోసం



ఏం చేశారని తమను ప్రశ్నించే వాళ్లు, మహారాష్ట్రలోని ముఖ్య పరిశ్రమలు గుజరాత్‌కు ఎందుకు తరలిపోతున్నాయి అనే దానికి బదులివ్వాలన్నారు. మహాయుతి ప్రభుత్వం వైఫల్యం వల్లే మహారాష్ట్రలోని డైమండ్ వ్యాపారమంతా గుజరాత్‌కు తరలిపోయిందని ఆయన ధ్వజమెత్తారు.

**ఫడ్నవిస్ వల్లే మేం కలిశాం : రాజ్ ఠాక్రే**

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌పై ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే ఫైర్ అయ్యారు. తమ ఇద్దరు సోదరులను కలపడం బాలాసాహెబ్ ఠాక్రే వల్ల కూడా కాలేదని, ఫడ్నవిస్ సర్కారు చేష్టల వల్ల తమ మధ్య దూరం తొలగిపోయిందన్నారు. మహారాష్ట్రలో హిందీ భాషను తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయంపై తాను రాష్ట్ర మంత్రి దాదా భూసేను నిలదీశానని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్‌లలో మూడో భాషగా ఏముందని ఆయన్ను ప్రశ్నించినట్లు రాజ్ ఠాక్రే చెప్పారు. హిందీ పాలిత రాష్ట్రాల్లోనే లేని రూల్‌ను మహారాష్ట్రలో బలవంతంగా ఎందుకు అమల్లోకి తెచ్చారని దాదా భూసేను ప్రశ్నించినట్లు తెలిపారు. అయితే తాను హిందీ వ్యతిరేకిని కాదని, ఏ భాషనూ వ్యతిరేకించనని తేల్చి చెప్పారు. మరాఠా సామ్రాజ్యం చాలా ప్రాంతాలను పాలించినా, ఎన్నడూ ఆయాచోట్ల మరాఠీని బలవంతంగా రుద్దలేదన్నారు. కానీ హిందీని బలవంతంగా రుద్దే ప్రక్రియను మహారాష్ట్రలోనే ప్రయోగాత్మకంగా మొదలుపెట్టినట్లుగా కనిపిస్తోందని రాజ్ ఠాక్రే విమర్శించారు. దీన్ని మహారాష్ట్ర ప్రజలు వ్యతిరేకించకుంటే, ముంబయి నగరాన్ని రాష్ట్రం నుంచి వేరు చేసేందుకూ వెనుకాడరని మండిపడ్డారు.

**మరాఠీపై ఉన్న ప్రేమను ప్రశ్నించగలరా?**

"మా పిల్లలు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చదువుకున్నారు. అయితేఏంటి? మరాఠీ మీడియం స్కూళ్లో చదువుకున్న దాదా భూసే మంత్రి అయ్యారు. ఇంగ్లిష్ మీడియంలో చదివిన ఫడ్నవిస్ సీఎం అయ్యారు. అయితే ఏంటి ? నేను మరాఠీ మీడియం స్కూలులో చదివాను. బాలాసాహెబ్ ఠాక్రే, మా నాన్న శ్రీకాంత్ ఠాక్రేలు ఇంగ్లిష్ మీడియంలో చదివారు. వాళ్లందరికి మరాఠీ భాషపై ఉన్న ప్రేమను ఎవరైనా ప్రశ్నించగలరా ? రేపు నేను హిబ్రూ భాషను కూడా నేర్చుకుంటాను. అలా చేసినంత మాత్రాన నాకు మరాఠీపై ఉన్న ప్రేమను ఎవరైనా ప్రశ్నిస్తారా ? మహారాష్ట్రలో ఉండే గుజరాతీలైనా, ఎవరైనా సరే మరాఠీ తెలిసిన వారై ఉండాలి. అయితే మరాఠీ భాషలో మాట్లాడనంత మాత్రాన వారిని కొట్టాల్సిన అవసరం లేదు. ఎవరైనా అనవసర డ్రామాలు చేస్తే మాత్రం మీరు గూబలు గుయ్‌మనేలా కొట్టండి. దాని వీడియోలు తీయకండి. బాధిత వ్యక్తే అందరికీ చెప్పుకోనివ్వండి" అని ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, ఈ సభ ప్రారంభం కావడానికి ముందు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఉద్ధవ్, రాజ్ సోదరులు పూలమాల వేశారు. ఈసందర్భంగా ఇద్దరు సోదరులు ఆప్యాయంగా కౌగిలించుకున్నారు.

### 6 గ్యారంటీలు, 63 అనుబంధ హామీల అమలుపై

# సీఎం రేవంత్‌కు లేఖ రాసిన బీజేపీ కొత్త చీఫ్

## హామీలిచ్చి 600 రోజులవుతుందని ప్రస్తావన



**హైదరాబాద్, మహా :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఎన్ రామచందర్ రావు తన తొలి లేఖను సీఎం రేవంత్ రెడ్డికి రాశారు. ఆరు గ్యారంటీల అమలుపై తన లేఖాస్త్రాన్ని సంధించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారని, ఇప్పటికి 600 రోజులవుతున్నా హామీలు అమలు కాలేదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే... ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు మినహా నెలకు రూ. 2500 లు ఇవ్వడం, చదువుకునే యువతులకు స్కూటీల అందజేత తదితర హామీలు అమలు కాలేదని గుర్తు చేశారు. ప్రతి రైతుకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి కేవలం 20 లక్షల మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ చేశారని, మిగతా వారికి చేయలేదన్నారు. అదే విధంగా రైతు భరోసా డబ్బులను యాసంగీ రెండు, వానాకాలం నాలుగు వాయిదాలు చెల్లించలేదని, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో రైతుల ఖాతాల్లో డబ్బులు వేశామని సంబరాలు జరుపుకున్నారని పేర్కొన్నారు. రైతులకు బాకీ పడ్డ డబ్బులను వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ళు లేని ప్రతి ఒక్కరికీ ఇళ్ళిస్తామని హామీ ఇచ్చారని ఇంతవరకు ఏ ఒక్క మండలంలోనూ ఈ హామీ పూర్తి చేయలేదన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వేసి నిర్ణీత గడువు ప్రకారం నియామకాలు చేపడతామని చెప్పి మాట తప్పారన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకూ ఇకపై అనువణువు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు కాంగ్రెస్ ను వెంటాడుతానని తెలిపారు.



### మహిళలకు 5 వేల

# ఈవీ ఆటోలు

- త్వరలోనే ఆర్టీసీకి కొత్త బస్సులు
- ఉద్యోగుల నియామకం కూడా చేపడతాం
- రవాణా మంత్రి మంత్రి పొన్నం

**హైదరాబాద్, మహా :** నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం ప్రజా భవన్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మహిళలకు 5 వేల ఈవీ ఆటోలు ఇచ్చే యోచన ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దీంతో హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. అలాగే, ఆర్టీసీకి త్వరలోనే మరో 100 కొత్త బస్సులను సమకూర్చనున్నామన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు చాలా కష్టపడుతున్నారని మంత్రి పొన్నం వారి సేవలను కొనియాడారు. ప్రజలకు మెరుగైన రవాణా సేవలందించేందుకు వారు పాటిస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఇక ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ కార్యకర్తలు, అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల అభిప్రాయాలు, అవసరాలను గ్రహించి ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కలగడంతో పాటు వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతుందన్నారు. మహిళల అన్ని రంగాల్లో ముందుకు వెళ్ళేందుకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలను పరిశీలిస్తుందని పేర్కొన్నారు.

# విమానం నుంచి దూకేసిన ప్రయాణికులు



విమానంలో తప్పుడు ఫైర్ అలర్ట్‌తో ఒక్కసారిగా ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఆగి ఉన్న విమానం నుంచి కిందికి దూకే క్రమంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. స్పెయిన్‌లోని పాల్మాడి మాలొర్కా ఎయిర్‌పోర్ట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో 18 మంది ప్రయాణికులు గాయపడగా.. వారిలో ఆరుగురిని ఆసుపత్రికి తరలించారు. మాంచెస్టర్‌కు బయలుదేరాల్సిన విమానం టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. స్పెయిన్‌లోని పాల్మా డి మయోర్కా విమానాశ్రయంలో ర్యాన్ ఎయిర్ బోయింగ్ 737 విమానంలో ఈ గందరగోళం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు ప్రయాణికులు ఎమర్జెన్సీ డోర్‌ల నుంచి బయటకు రాగా.. మరికొందరు విమానం రెక్కలపైకి ఎక్కి నేలపైకి దూకారు. ఇది తప్పుడు ఫైర్ అలర్ట్ అని తేలడంతో విమానయాన సంస్థ ప్రయాణికులకు క్షమాపణలు తెలిపింది.



## పూరి జగన్నాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్తోపల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ పూరి జగన్నాధుని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, బిజెపి మాజీ డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, ప్రేమ్ గౌడ్, సరికొండ వెంకటేష్, అర్జున్, భాషా శ్రీనివాస్, ఎల్లప్ప, విజయ్, కాశి గారి యాదగిరి, కాంగ్రెస్, బిజెపి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీకి నిధులు పెంచాలి

## రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య

ఇందిరమ్మ ఇండ్ల పథకం లో ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వ హామీ ప్రకారం ఆరు లక్షలు ఇవ్వాలి

వ్యవసాయ కార్మికుల సమస్యలు ప్రభుత్వాలకు ఎందుకు పట్టవు సమాధానం చెప్పాలి. పుస్తకాల నర్సింగరావు

**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో పెన్షనర్స్ భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా 9వ మహాసభ జిల్లా అధ్యక్షులు జే అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా కాంతయ్య మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామి రోజురోజుకు నిర్వీర్యపరుస్తుందని మండిపడ్డారు 2005లో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ పథకం పేదలకు వ్యవసాయ కార్మికులకు జీవనోపాధిగా బ్రహ్మాండంగా కొనసాగిందని అన్నారు. అలాంటి పేదల సంబంధించిన పథకం సరైన నిధులు కేటాయించక పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులను తీసివేయడం వెనక ఉన్న ఉద్దేశం పథకాన్ని నిర్వీర్యపరిచి ఎత్తేయాలను వియోచన చేస్తుందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం జోలికి వస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఆరు గ్యారంటీలు ముఖ్యమైనవని వాటిలో ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా కీలకమైందని అన్నారు. అలాంటి పథకాన్ని ఎస్సీ ఎస్టీలకు ఆరు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదు లక్షలు ప్రోస్డింగ్ లు దళిత గిరిజనుల లబ్ధిదారుల చేతిలో పెట్టి చేతులు దులుపుకుంటుందిని మండిపడ్డారు. చిత్తశుద్ధి లేని హామీలు ఇస్తున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు పరచడంలో పునర్ ఆలోచన చేయాలని ఆయన సూచించారు. వెంటనే దళిత గిరిజనులకు ఆరు లక్షలు ఇంటి నిర్మాణం కోసం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా దళిత గిరిజన లబ్ధిదారులను సమీకరించి పెద్ద ఎత్తున సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు మాట్లాడుతూ.... వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు అని మండిపడ్డారు ఉచిత బియ్యం ఇచ్చి ప్రజల ఓట్లు కొల్లగొట్టి అధికార దాహంతో జల్సాలు చేస్తున్నారు.



స్వతంత్రం వచ్చినప్పటి నుంచి నేటి వరకు పేదలు పేదలుగానే ఉన్నారని పేదల బతుకులు ఎలాంటి మార్పు జరగడం లేదని పేదలు పోరాటాల శరణమని వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరి నరసింహారెడ్డి, బుద్ధుల జంగయ్యలు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్ లక్ష్మయ్య,రమేష్ యాదవ్, జిల్లెల్ల వెంకటేష్,స్వరూప, యశోద,రాజు నాయక్, రాములు, జి జంగయ్య, బాలకృష్ణయ్య, సిబి చంద్రయ్య, సుధీర్, దామోదర్ రెడ్డి,లింగం తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి నుండి కేసీఆర్ డిశ్చార్జి



**హైదరాబాద్, మహా :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి నుంచి శనివారం డిశ్చార్జి అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయిల పర్యవేక్షణకు ఆసుపత్రిలో చేరాల్సిందిగా వైద్యులు సూచించడంతో ఆయన రెండు రోజులు అక్కడే ఉండి చికిత్స పొందారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో శనివారం ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. కేసీఆర్ వెంట హరీష్‌రావు, సంతోష్‌రావు లు ఉన్నారు. అనంతరం కేసీఆర్ నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు. కాగా కేసీఆర్ కోసం ఆస్పత్రికి కవిత వెళ్ళారు. తర్వాత డిశ్చార్జి అయిన కేసీఆర్ ను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, పాలమూరు జిల్లా నేతలు కలిశారు.

# ఏపీలో ఎన్టీఆర్ బేబీ కిట్లు

**అమరావతి, మహా :** ఏపీలో ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవించిన వారికి 'ఎన్టీఆర్ బేబీ కిట్లు' అందచేయాలని సీఎం చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కిట్ల పంపిణీ టెండర్ల బాధ్యతను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలుమౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ)కి అప్పగించారు. శిశు ఆరోగ్య సంరక్షణ కోసం 2016లో టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టగా.. ఆ తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. అయితే మళ్లీ 'ఎన్టీఆర్ బేబీ కిట్లు' పేరుతో ఆ పథకాన్ని పునఃప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కిట్‌లో దోమ తెరతో కూడిన పరుపు, వాటర్ ప్రూఫ్ షీటు, దుస్తులు, నాప్కిన్లు, తువ్వాలు, సబ్బు, సబ్బు పెట్టె, పౌడర్, ఆయిల్, షాంపూ, బొమ్మ వంటి 11 వస్తువులు ఉంటాయి. 26 జిల్లాల్లోని డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్ఎస్‌లు, జీజీహెచ్‌లకు రెండేళ్ల పాటు 'రేట్ కాంట్రాక్ట్' పద్ధతిలో కిట్లు సరఫరా చేసేలా టెండర్లు పిలిచారు.

EDITORIAL సంపాదకీయం

# రసవత్తర రాజకీయాలు

తెలంగాణ రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఎఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సభ అనంతర పరిణామాలు అధికార కాంగ్రెస్ పార్టీలో హాట్ హాట్ గా మారాయి. బిజెపి స్టేట్ చీఫ్ గా ఊహించని రీతిలో ఎన్. రామచందర్ రావు ను ఎంపికచేసి ఆశావహ ఎంపీలకు హైకమాండ్ షాకిచ్చింది. ఈ ఎంపిక వెనుక చక్రం తిప్పినవారు.. చిత్తయిన వారిపై చర్చ సహజం. బిఆర్ఎస్ పార్టీ లో కవిత రైలు ఢిల్లీ దిశగా పరుగులు పెడుతుండగా, గులాబీ క్యాడర్ లో ఇది హాట్ టాపిక్ గా మారింది. అంతర్జాతీయంగా భారత వైఖరి, విదేశాంగ విధానంలో లోపాలు ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

తెలంగాణ రాజకీయాలపై జూబ్లిహిల్స్ బైపోల్ ప్రభావం బలంగా ఉండనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్న నేపథ్యంలో జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక లో గెలుపు అధికారపార్టీకి అత్యంత కీలకం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ ఎన్నిక కాంగ్రెస్ పార్టీకి ఎంత కీలకమో చెప్పేశారు. ఈ ఉప ఎన్నికలో గెలిచే పార్టీకి గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లోఅడ్వాంటేజ్ ఉండనుంది. మైనారిటీలు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గం గెలవాల్సిన అనివార్యత కాంగ్రెస్ పై ఉంది. కాంగ్రెస్ జూబ్లీహిల్స్‌లో గెలుపొందే అభ్యర్థిని ఎంచుకోవడానికి అంతర్గత సర్వేలు నిర్వహిస్తోంది. ఏ రాజకీయ పార్టీ అయినా అంతర్గత సర్వేలు నిర్వహించడం సహజం. అయితే ఊహించని కొత్త అభ్యర్థులు రంగంలోకి వచ్చే అవకాశాలున్నాయి. బిఆర్ఎస్ పార్టీ నుండి దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ కుటుంబ సభ్యుడిని అభ్యర్థిగా నిలబెట్టే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో బలమైన సంస్థాగత నిర్మాణంతో బిఆర్ఎస్ తమ పట్టు నిలబెట్టుకోవడానికి ఈ ఉప ఎన్నిక ఓ వేదిక. తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కీలక మలుపులకు కారణం కాబోతున్నది. కాంగ్రెస్‌కు ఈ ఉప ఎన్నిక పరీక్ష. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గెలిస్తే, హైదరాబాద్‌లో పార్టీ బలం పెరుగుతుంది. ప్రతిపక్షాల ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. మరికొంతకాలం పార్టీకి తిరుగుండదు. ఓడితే ప్రభుత్వంపై విమర్శలు తీవ్రమవుతాయి. బిఆర్ఎస్ కు ఈ గెలుపు ప్రాణావసరం. పార్టీ ఊపిరి పీల్చుకునే అవకాశం ఇస్తుంది, ముఖ్యంగా ఇటీవలి ఎన్నికల్లో వచ్చిన ఓటముల తర్వాత పార్టీ క్యాడర్ కు భవిష్యత్ పై ఆశలు కల్పించడానికి అత్యంత కీలకం. గెలిచినా, గణనీయ ఓట్లు సాధించినా బిజెపి హైదరాబాద్‌లో తమ ఉనికిని బలోపేతం చేసుకోవచ్చు. బిజెపి గెలిస్తే రాష్ట్ర రాజకీయాలపై పెనుప్రభావం పడుతుంది. అయితే మైనారిటీ ఓటర్లు ఎటు మొగ్గితే గెలుపు అటే మొగ్గే నియోజకవర్గం జూబ్లిహిల్స్. దీనిని పరిగణనలోకి తీసుకునే మరో బై పోల్ కు బిజెపి ప్లాన్ చేస్తోంది.





తెరవెనుక రసవత్తర రాజకీయాలు తెలంగాణలో జరుగుతున్నాయి. అన్ని రాజకీయపార్టీలలో ఇది ఉంది. రామచందర్ రావు నియామకం వెనుక కేంద్రమంత్రి బండి సంజయ్ బలమైన పాత్ర పోషించాడని, ఆర్ఎస్ ఎస్ మద్దతు దీనికి తోడైందని చెబుతున్నారు. గతంలో బండి సంజయ్ ఈటల రాజేందర్ కు చెక్ పెట్టగా, ఇపుడు ఈటల రాజేందర్ కు బండి చెక్ పెట్టాడన్న వార్త కాషాయవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అందరివాడుగా పేరున్న రామచందర్ రావు బిజెపి పగ్గాలు చేపట్టగానే దూకుడుమీదున్నాడు. అంచనాలకు భిన్నంగా హాట్ కామెంట్స్ చేస్తూ రాజకీయ సెగలు పుట్టిస్తున్నాడు. బిజెపి గ్రూపు రాజకీయాలకు ఇపుడు రామచందర్ రావే సరైన మందుగా హైకమాండ్ భావించింది. ఇది సంచలన పరిణామమే.

కాంగ్రెస్‌లో పదవుల జాతరపై తరచూ ప్రకటనలు వస్తుంటాయ్. కానీ భర్తీ జరగదు. కాంగ్రెస్ పార్టీలో జరిగినన్ని వడపోతలు, అభిప్రాయ సేకరణలు, సర్వేలు ఇతర పార్టీల్లో జరగవు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా నామినేటెడ్ పదవుల జాతర జరగలేదు. కార్యకర్తల్లో నారాజ్ కు ఇదే కారణమని హైకమాండ్ కు, పార్టీ పెద్దలకు తెలుసు. అయినా ఎందుకో అలా కాలం గడిచిపోతూనే ఉంటుంది. ఈనెలలో పక్కా అన్న మాటను కార్యకర్తలు పదులసార్లు విన్నారు. అయినా కారణాలు తెలియవు. ఈసారి ఖర్గే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా పదవుల భర్తీ పూర్తవుతుందన్న నమ్మకం క్యాడర్ కు కలగడం లేదు. ఏడాదిన్నరగా స్థానికసంస్థల ఎన్నికల గురించి ప్రతీ సమావేశంలో నేతలు చెబుతున్నా.. ఏమైందో అందరికీ తెలిసిందే. ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పార్టీ చెప్పుకోదగ్గ విజయాలు అనేకం సాధించింది. ఎస్సీవర్గీకరణ చేసిన తొలి స్టేట్ తెలంగాణే. కులగణనలో దేశానికి రోల్ మోడల్ గా నిలిచింది. రైతు భరోసా, రుణమాఫీ, సన్నబియ్యం, ఉద్యోగాల భర్తీ, ఇందిరమ్మ ఇళ్ళ పథకం ఇలా ఎన్నో ఉన్నాయి. అయినా ఏదో మీమాంస. లోలోన భయం. క్యాడర్ లో ఆత్మస్థైర్యం నింపి, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు త్వరగా భర్తీచేసి.. దూకుడుగా గ్రామాల్లోకి వెళ్ళొచ్చు. కాలం కరిగిపోతున్నా ఆ దిశగా కార్యాచరణ జరగడం లేదు.

బిఆర్ఎస్ పార్టీలో ముఖ్య నాయకురాలిగా ఉన్న కవిత ఇటీవలి కార్యక్రమాలు బిఆర్ఎస్ పార్టీలో హాట్ టాపిక్ గా మారాయి. పార్టీ అధికారిక ఎజెండా తో సంబంధం లేకుండా తన రూటే సపరేటు అంటూ దూసుకుపోతున్నారు. కవిత స్పందించినంత ధైర్యంగా అంతర్గత రాజకీయాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించడం లేదు. అధినేత కేసీఆర్ స్పందించరు. ఒక్క కేటీఆర్ కు తప్ప స్పందించే అధికారం, పదవులు ఎవరికీ లేవు. రైల్ రోకోకు బిఆర్ఎస్ పార్టీ మద్దతు ఉన్నదా లేదా? మద్దతు లేకపోతే పార్టీ లోని నేతలు ఎవరైనా ఇలానే సొంత ఎజెండాతో కార్యక్రమాలు ప్రకటించవచ్చా? ప్రకటిస్తే చూస్తూ ఊరుకుంటారా? కవిత కార్యాచరణ పై బిఆర్ఎస్ పార్టీ అధికారిక స్టాండ్ ఏమిటి? అన్న చర్చలకు సమాధానాలు ఇవ్వవలసి ఉన్నది. స్పష్టత ఇవ్వకుంటే అది ఫైనల్ గా బిఆర్ఎస్ కే నష్టం చేసే ప్రమాదమున్నది. కవిత తన రాజకీయ ఇమేజ్‌ను పునర్నిర్మించేందుకు స్వతంత్ర కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో కొన్ని పార్టీ లైన్ లో ఉంటుండగా, మరికొన్ని ఇబ్బందికరంగా ఉంటున్నవి.

భారత విదేశాంగ విధానంపై ఇపుడు చర్చ జరుగుతున్నది. 11 ఏళ్ళుగా ప్రధాని మోదీ వందకు పైగా విదేశీపర్యటనలు చేయగా, భారత్ చుట్టు పక్కల దేశాలన్నీ ఇపుడు ఒక్కొక్కటిగా వ్యతిరేకంగా మారడం ప్రజలను ఆందోళనలకు గురిచేస్తోంది. భారత్ పై గోళిక రాజకీయ ఒత్తిడి కనబడుతోంది. పహల్గాం దాడి తర్వాత భారత్ పాక్ యుద్ధాన్ని తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించుకోవడంపై దేశం షాక్ కు గురైంది. రష్యాఉక్రెయిన్ యుద్ధం, చైనాభారత్ సరిహద్దు ఉద్రిక్తతలు, మధ్యప్రాచ్య సంక్షోభం వంటి అంతర్జాతీయ సమస్యలు భారత్ యొక్క విదేశాంగ విధానాన్ని సవాలు చేస్తున్నాయి. మరోవైపు గ్లోబల్ ఆర్థిక మాంద్యం, ఇంధన ధరల పెరుగుదల వంటివి భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి, ఇవి మోదీ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. అంతర్జాతీయ మీడియా, మానవ హక్కుల సంస్థల నుంచి భారత్‌లో మత స్వేచ్ఛ, మీడియా స్వాతంత్ర్యంపై వస్తున్న విమర్శలు మోదీ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. అయితే ఈ సవాళ్ళను అధిగమించి మూడో టర్మ్‌లో మోదీ ప్రస్థానం విజయవంతంగా ఎలా కొనసాగించడం పరీక్ష.

## తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడు...

# ఎన్నో సవాళ్లు



- మాచనపల్లి శ్రీధర్
సీనియర్ జర్నలిస్ట్, 9052789666

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు అవుతారు అనే ఉత్కంఠకు తెర పడింది. మాజీ ఎమ్మెల్సీ బిజెపి సీనియర్ నేత రామచందర్ రావు పార్టీ నూతన అధ్యక్షునిగా నియమించబడ్డారు. ఈ నిర్ణయం కొంత మందికి నిరాశ కలిగించగా మరి కొంతమందికి సంతోషాన్ని మిగిలించింది. కాంగ్రెస్ ప్రభుత్వంతో బలంగా కొట్లాడి రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలో అధికారంలోకి రావాలి అని బలంగా నిర్ణయించుకున్న వారికి ఈ నిర్ణయం చేదు గుళికలాగా మారింది. రామచందర్ రావు నిబద్ధతకు పార్టీలో సంవత్సరాలుగా వారు చేసిన సేవలకు ప్రతి ఒక్కరు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ బలమైన నాయకత్వాన్ని బిజెపికి అందించి ఇప్పటికైనా తెలంగాణలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలనే చాలామందికి వారి సౌమ్యమైన వ్యవహార శైలి పట్ల మరో భావన కలిగి ఉంది. ఈ విషయం పట్ల ప్రమాణ స్వీకారం చేసిన రోజే నేరుగా స్పందించిన రామచంద్ర రావు నన్ను ఎవరైనా డమ్మీ అధ్యక్షుడు అని పిలిస్తే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని నేను నక్సలైట్లతో కొట్లాడాను సంవత్సరాలుగా పార్టీకి సేవ చేశాను దూకుడు అంటే మాటలతో కాదు సిద్ధాంతానికి కట్టుబడి ఉండడం అని వారు వారి అభిప్రాయాన్ని వ్యక్తపరిచిన తీరు వారిపై ఇప్పటికే ఉన్న ఒత్తిడికి సాక్ష్యంగా నిలిచింది. తెలంగాణలో బిజెపి అధ్యక్షుల నియామకం ఎప్పుడు అయోమయానికి అభద్రత భావానికి దారితీస్తూనే ఉంది. కెసిఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొట్లాడిన బండి సంజయ్ లాంటి నాయకుడిని ఎన్నికల ముందు తొలగించడం ఇప్పుడు ఈటల రాజేందర్ ధర్మపురి అరవింద్ లాంటి దూకుడు స్వభావం కల బలమైన నాయకత్వాన్ని ముందుకు తీసుకురాకుండా సిద్ధాంతానికి కట్టుబడిన సౌమ్యమైన రామచందర్ రావు గారిని అధ్యక్షునిగా నియమించడం బిజెపి అధిష్టానానికి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావాలి అనే భావన ఉందో లేదో అని చాలామంది విశ్లేషకులు బిజెపి సానుభూతిపరులు కూడా భావిస్తున్నారు.





### ప్రశ్నార్థకమవుతున్న క్రమ శిక్షణ

క్రమశిక్షణకు సిద్ధాంతానికి కట్టుబడి ఉండే భారతీయ జనతా పార్టీలో ఈ మధ్య కాలంలో పరోక్షంగా అసమ్మతి రాగం వినబడుతుంది. నూతన అధ్యక్షుని నియమాకం తర్వాత కొంతమంది నాయకులు కార్యక్రమానికి హాజరు కాకుండా వ్యవహరించిన తీరు సందేహాలను కలిగిస్తుంది. రాజాసింగ్ లాంటి నాయకులు బహిరంగంగానే చేసిన ప్రకటనలు పార్టీకి రాజీనామా చేసిన తీరు బిజెపిలో ఉన్న అయోమయాన్ని తెలియజేసింది. దేశంలోనే బలంగా ఉన్న భారతీయ జనతా పార్టీ తెలంగాణ విషయంలో నిర్ణయాలు తీసుకోవడంలో అనేక తప్పటడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది నిర్ణయాల్లో ఆలస్యం లక్ష్యానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోకపోవడం తెలంగాణ రాష్ట్రానికి ప్రకటించే ఇంచార్జ్ లు కూడా తరచుగా విఫలం అవుతుండడం నాయకుల్లో పార్టీ కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత పెరగడం ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు సరైన గుర్తింపు లేకపోవడం ఉపన్యాసాల్లో మాత్రమే కార్యకర్తలకు దొరికే ప్రోత్సాహం కమిటీల్లో ఇతర విషయాల్లో పూర్తిగా నిర్లక్ష్యానికి గురి కావడం కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు అన్నట్లు తెలంగాణలో బిజెపి విఫలానికి అనేక కారణాలు రోజుకొకటి బయటపడుతున్నాయి.

### తెలంగాణలో బిజెపి వంతు వస్తుందా?

దేశంలో జరిగే ఏ ఎన్నికల్లో బిజెపి గెలిచిన ఇక తెలంగాణలో గెలవడమే తరువాయి అని మీడియా సమావేశాల్లో ప్రగల్బాలు పలికే నాయకులు కనీసం వారి స్థానం కాకుండా కాకుండా వేరే ఏ ఒక్క స్థానాన్ని కూడా గెలిపించు కోలేకపోవడం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం కంటే పార్లమెంట్ ఎన్నికల్లోనే పోటీ చేయడానికి ఆసక్తి చూపించడం రాష్ట్రంలో ఆ పార్టీ స్థితిగతులకు ఉదాహరణగా నిలుస్తుంది.

### ప్రజా సమస్యలపై పోరాటమేది...?

తెలంగాణ ప్రజలు కేసీఆర్ కు ప్రత్యామ్నాయంగా ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో తప్పటడుగులు చేస్తున్నప్పటికీ బీజేపీ క్షేత్రస్థాయిలో చేస్తున్న పోరాటాలు అంతంత మాత్రం గానే ఉన్నాయి. ఎన్నికల ముందు హడావిడి చేసే బిజెపి నాయకులు ప్రజా సమస్యలపై కొట్లాడే విషయంలో మాత్రం మీడియా పులుల్లాగా మారిపోతున్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ పెద్దపెద్ద నాయకుల మౌనం తెలంగాణ ప్రజలకు అనేక అనుమానాలను కలిగిస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే ఇప్పుడు అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన సగం సీట్లు కూడా రాబో ఎన్నికల్లో గెలుస్తారా అనే అనుమానం సొంత కార్యకర్తల్లోనే మిగిలి ఉంది.

### నూతన అధ్యక్షునికి సవాళ్ళు...!

ఇలాంటి క్లిష్ట తరుణంలో అధ్యక్ష బాధ్యతల స్వీకరించిన రామచంద్ర రావు సంస్థాగత విషయాల పట్ల వారికి ఉన్న అవగాహనతో పార్టీని పటిష్టం చేస్తారా లేదా పెద్ద పెద్ద నాయకుల సూచనల మేరకు పనిచేసి సొంత ముద్ర వేయడంలో విఫలం అవుతారో కాలమే సమాధానం చెప్పాలి. బిజెపిలో ఉన్న సీనియర్ నాయకులు గతంలో అధ్యక్షులుగా పనిచేసిన నాయకులు కూడా రామచందర్ రావుకు స్వేచ్ఛగా పనిచేసే అవకాశం ఇవ్వాలి అలా కాకుండా వారి నిర్ణయాల మీదకే నూతన అధ్యక్షుడు పనిచేయాలని కోరుకుంటే మాత్రం బిజెపి నావ పూర్తిగా మునిగే అవకాశం ఉంది. విద్యార్థి దశ నుంచి సమస్యలపై పోరాటం , ఆర్ఎస్ఎస్ వివిధ క్షేత్రాల సంఘటన పట్ల , క్షేత్రస్థాయిలో పార్టీ స్థితిగతుల పట్ల పూర్తి అవగాహన గల విద్యావంతుడైన రామచందర్ రావు ఎంత సామర్థ్యం గల నాయకుడు అయినప్పటికీ మారిన రాజకీయ పరిస్థితులు రాజకీయాల్లో వాడుతున్న భాష వ్యవహార శైలి వారి సౌమ్యమైన రాజకీయ విధానాలకు సరితూగుతాయో లేదా అనేది పెద్ద ప్రశ్నగా మిగులుతుంది. విషయ పరిజ్ఞానం విషయానికి కట్టుబడి మాట్లాడడం కంటే ప్రతిపక్షాలను తూలనాడడం బూతులతో విరుచుకు పడడం ప్రస్తుత రాజకీయ స్టైల్. ఈ తరహా రాజకీయాలకు రామచందర్ రావు సరితూగి సత్తాను చాటుతారో లేదో కాలమే సమాధానం చెప్పాలి.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# 15 సంవత్సరాలలో చేయనిది 15 నెలలలో చేసి చూపించాం



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గత 15 సంవత్సరాలుగా చేయని అభివృద్ధిని, ప్రజా పాలనలో ప్రజా ప్రభుత్వం 15 నెలలలో చేయడంతో చూసి జీర్ణించుకోలేక, స్థానిక ఎమ్మెల్యే పై అసత్యాలు మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా చేయడం బీఆర్ఎస్ కు తగదని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బొంగులూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, A బ్లాక్ అధ్యక్షులు పాండురంగ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భూపతిగల్లా మహిపాల్, మంకాల దాసు, రాచర్ల వెంకటేశ్వర్లు, సిద్ధగౌని బాలరాజ్ మాట్లాడుతూ.... నియోజకవర్గంలో ఇప్పటివరకు 400 కోట్లతో, అనేక అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్రంలోని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తన వంతు కృషి చేస్తూ ఉండడం సంతోషమని అన్నారు.

**కనీస వసతులు కల్పించని గత పాలకులు....**

మంచాల మండల పరిధిలోని నోముల, లింగంపల్లి గేటు వద్ద డబల్ బెడ్ రూములను గత ఏడు ఎనిమిది సంవత్సరాల క్రితమే నిర్మాణం చేపట్టడం జరిగింది. వాటిలో ప్రజలకు కావలసిన కనీస మౌలిక వసతులు కల్పించకుండా, లబ్ధిదారులకు కేటాయించకుండా వదిలేయడం జరిగిందని, స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి డబల్ బెడ్ రూములను పూర్తి స్థాయిలో పరిశీలించగా అక్కడ కనీస వసతులు లేకపోవడంతో, వాటికి కావాల్సిన రోడ్లు, విద్యుత్, మంచినీటి సరఫరా, అండర్ డ్రైనేజీ వ్యవస్థ వంటి వాటిని సమకూర్చి, రెండు నెలలలోనే అందించాలనే సదుద్దేశంతో ఎమ్మెల్యే ప్రజలకు గతంలోని తెలియజేయడం జరిగిందని అన్నారు.

**15 నెలలోనే ప్రజల మన్నలను పొందిన ప్రభుత్వం...**

గత 15 సంవత్సరాలుగా ప్రజలను ఏమార్చి, ప్రజాధనాన్ని కొల్లగొట్టిన గత పాలకులు, శనివారం అభివృద్ధి పై మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. 15 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు, మహిళలకు ఉచిత బస్సు, 500కే గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ వంటివి కార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్నామని వారికి గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు అనేక విధాలుగా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ప్రజల మన్నలను పొందిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

**పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు...**

రాష్ట్రంలోని సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందించడం జరుగుతుందని తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత 200 యూనిట్ల విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు రవాణా, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, యువతకు రాజీవ్ యువ వికాసం వంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా అందజేయడం జరుగుతుందని ఒకసారి పరిశీలించుకోవాలని వారికి సూచించారు. గత ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలకు నాయకులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని గుర్తు చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి అడ్డు కాలు వేయాలని మంచి రెడ్డి చూస్తున్నారని తెలిపారు.

**మంత్రి పదవిపై మాట్లాడడం విడ్డూరం....**

రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అని గుర్తు చేశారు. జిల్లాకు ప్రాతినిధ్యం ఉండాలని సదుదేశంతో జిల్లా అభివృద్ధి అభివృద్ధి కోసం మంత్రి పదవి కోరడంలో తప్పు ఏం లేదని వారు అన్నారు. మాజీ ఎమ్మెల్యే మచ్చిరెడ్డి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయాలపై మాట్లాడడం, మంత్రి పదవిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జడల రవీందర్ రెడ్డి, పండాల శంకర్ గౌడ్, ఆదిభట్ల మున్సిపాలిటీ నాయకులు పొట్టి ఐలయ్య, శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నేర ప్రవృత్తిని వీడండి... సన్మార్గంలో నడవండి

**మందమర్రి సర్కిల్ రౌడీ షీటర్లకు ఏసిపి రవికుమార్ కౌన్సిలింగ్**

**మందమర్రి, మహా:** రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని వీడండి... సన్మార్గంలో నడవండని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ వెల్లడించారు. శనివారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో రామకృష్ణాపూర్, మందమర్రి, కాజీపేట, దేవాపూర్ పోలీస్ స్టేషన్ లకు చెందిన రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ మందమర్రి సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు తమ నేర ప్రవృత్తిని తక్షణమే వీడి, సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇలా జీవించలేని పక్షంలో అత్యంత కఠినమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో తెలిసి తెలవకుండా మీరు చేసిన నేరాలను పక్కనపెట్టి ప్రజాస్వామ్యంలో అన్ని హక్కులను పొంది దర్జాగా జీవించే అవకాశం మీకు ఇవ్వడం జరిగిందని అన్నారు. అయినా మీలో మీ ప్రవర్తనలో మార్పు రాకపోతే, పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక రౌడీషీటర్ కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో రౌడీ షీటర్లు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, ఉపేక్షించే ప్రసక్తే లేదు," అని స్పష్టం చేశారు. నేరాల వల్ల కేవలం నేరస్తులే కాకుండా, వారి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "డాక్టర్ల పిల్లలు డాక్టర్లు, పోలీసుల పిల్లలు పోలీసులు అవుతున్నారు. మీ పిల్లలు కూడా మిమ్మల్ని అనుసరిస్తే వారూ నేరస్తులుగానే మారే ప్రమాదం ఉందని వివరించారు. మత్తుమందు మద్యానికి బానిసలై కొత్త కేసుల జోలికి వెళ్లొద్దని హితవు పలికారు.మీరు చేసే మంచి పనులను కూడా ఇకపై మీ రికార్డులలో నమోదు చేస్తామని తెలిపారు. మీలో సంపూర్ణమైన మార్పు వస్తే, ఉన్నతాధికారుల సూచనల మేరకు మీపై ఉన్న రౌడీ షీట్‌ను తొలగించే విషయాన్ని కూడా పరిశీలిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ ఇతర పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ నెల 12న చెట్ల తొలగింపుకు వేలం పాట

**మంచిర్యాల, మహా :** హైదరాబాద్ కరీంనగర్ చాందా రోడ్డు 251/9 కిలోమీటర్ నుండి 255/7 వరకు (మంచిర్యాల ఐ. బి. చౌరస్తా నుండి శ్రీనివాస గార్డెన్) వరకు రోడ్డు వెడల్పులో భాగంగా ఇరువైపులా గల 63 చెట్లను తొలగించేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వహక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు ఈ నెల 12 నాడు సాయంత్రం 4 గంటలకు మంచిర్యాల జిల్లాలోని కలెక్టర్ భవన సముదాయంలో రెండవ అంతస్తులోని రూమ్ నంబర్ 26 రహదారులు భవనాల శాఖ కార్యాలయంలో నిర్వహించే వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.



## బీహార్ కేంద్రంగా నిషేధిత మత్తు పదార్థాల సరఫరా

- గంజాయి స్వాధీనం.. ఒకరి రిమాండ్
- 11 కిలోల130 గ్రాముల గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన డీపీఈఓ ఉజ్వల రెడ్డి

**షాద్ నగర్, మహా:** బీహార్ రాష్ట్రాన్ని కేంద్రంగా చేసుకొని మత్తు పదార్థాలను జోరుగా రవాణా చేసుకుంటున్నారు. జీవనోపాధి కోసం అక్కడి నుండి కొంతమంది ఇక్కడకు వచ్చి వ్యాపారం చేసుకుంటూ మత్తు పదార్థాల క్రయవిక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలోని నందిగామ మండల కేంద్రం సమీపంలో పాత జాతీయ రహదారి కి ఆనుకొని ఉన్న ఓ కిరాణా షాపులో మూడు లక్షల 50వేల విలువ చేసే 11 కిలోల 130 గ్రాముల గంజాయి షాద్ నగర్ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం షాద్ నగర్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఈఓ ఉజ్వల రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నందిగామ మండల కేంద్రం సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన ఓ కిరాణా షాపులో బీహార్ రాష్ట్రానికి చెందిన పింటూ సింగ్ అనే యువకుడు గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం వచ్చిందని తెలిపారు. దాంతో షాద్ నగర్ ఎక్సైజ్ శాఖ సిఐ టి. శేఖర్ ఆధ్వర్యంలో సిబ్బందితో తనిఖీ చేయగా 2 కిలోల గంజాయి ముడి పదార్థం, 9 కిలోల 150 గ్రాముల 40 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. మొత్తం 11 కిలోల 130 గ్రాముల గంజాయి లభించిందని, వీటి విలువ 3.50 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడు నుండి గంజాయిని, సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వివరించారు. గంజాయిని నియంత్రించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## మణికొండ మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్**

**రాజేంద్రనగర్ మహా ;** ఏడు కోట్ల 77 లక్షల రూపాయలతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. మునుపు పెన్నడు ఎరగని రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి మరో పక్క సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికలలో పాదయాత్ర తో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి వరించేదెవరికో..?

- నామినేటెడ్ పోస్టులపై ఆశావహుల్లో ఆశలు
- మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలతో హస్తం నేతల్లో హర్షం
- ప్రజాప్రతినిధులు, కీలక నేతల చుట్టూ ప్రదక్షిణలు
- ఈ నెల 30లోపే భర్తీకి నిర్ణయం



**ఆదిలాబాద్, మహా:** కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ కోసం శ్రమించిన నాయకులకు పదవులు వరించనున్నాయి. ఏడాది కాలంగా జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. తాజాగా హైదరాబాదులో కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లోపే నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని..ఈ నెల 30వ తేదీలోపు పూర్తిచేయాలని సూచించడంతో ఇన్నాళ్లు పదవుల కోసం ఆశగా ఎదురుచూసిన కాంగ్రెస్ నేతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉండి అనేక ఆటుపోట్లు ఎదుర్కొని పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు ఈ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. అప్పుడే ఆ పార్టీకి చెందిన ఇంఛార్జి మంత్రి, ఎమ్మెల్యేలు, కీలక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల ఇంఛార్జీల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**కాంగ్రెస్ లో మరింత జోష్...**

జిల్లాలో మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ప్రారంభం కున్నాయి. సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం యంత్రాంగం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తోంది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేక మంది ఆశావహులు ఈ పదవులపై కన్నేశారు. సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్ వంటి స్థానాల్లో పోటీ చేయడం ద్వారా ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులుగా సేవలందించవచ్చు. మరోపక్క ఆ పార్టీకి చెందిన పలువురు కీలక నాయకులు జడ్పీ చైర్మెన్, మున్సిపల్ చైర్మెన్ వంటి పదవులను దక్కించుకోవాలని ఆరాటపడుతున్నారు. దీంతో ఎన్నికల ద్వారానూ అధికార పార్టీలో అనేక పదవులు భర్తీ కానుండటంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో హర్షం వ్యక్తమవుతోంది. తాజాగా ప్రభుత్వ పరిధిలో ఉండే జిల్లా స్థాయి పదవులైన గ్రంథాలయ సంస్థ చైర్మెన్, ఐసీడీఎస్ సమన్వయకర్తలతో పాటు ఐటీడీఏ పాలక మండలి, మార్కెట్ కమిటీ పదవులు భర్తీ కానున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే చాలా వరకు మార్కెట్ కమిటీ పదవులు భర్తీ కాగా.. వివిధ కారణాలతో మరికొన్ని భర్తీకి నోచుకోలేదు. వీటితో పాటు కొత్తగా నామినేటెడ్ పదవులు సైతం భర్తీ కానుండటం ఆ పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**ఎవరికి వరించేనో..?**

ప్రభుత్వం భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవులను దక్కించుకోవాలని అధికార పార్టీకి చెందిన అనేక మంది ముఖ్య నాయకులు ఆశలు పెట్టుకున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అనేక అవరోధాలు ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడానికి తీవ్రంగా కష్టపడ్డారు. వారి కృషి ఫలితంగా కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగలిగింది. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే రాష్ట్ర స్థాయిలో పలు కార్పొరేషన్ పదవులను భర్తీ చేసిన ఆ పార్టీ అధిష్టానం.. జిల్లా స్థాయి పదవుల భర్తీ మాత్రం చేపట్ట లేదు. కేవలం మార్కెట్ కమిటీలను మాత్రమే పూర్తి చేసింది. తాజాగా ప్రభుత్వం మిగిలిన పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపడంతో ఆ పార్టీకి చెందిన క్రియాశీలక నాయకులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఇంఛార్జి మంత్రితో పాటు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇంఛార్జీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు పదవులు వచ్చేలా కృషి చేయాలని కోరుతున్నారు. మరికొందరు ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకుంటూ ఆయా పదవులకు తమ పేర్లు పరిశీలించాలని కోరుతున్నారు. పార్టీ కోసం చేసిన కృషిని వారికి వివరిస్తూ పదవి ఇప్పించాలని వేడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. మొత్తానికి ఈ నెలలో భర్తీ కానున్న నామినేటెడ్ పదవులు ఎవరిని వరిస్తాయా..? అనేది అందరిలో ఉత్కంఠ రేపుతోంది.



## నకిలీ స్టాంపుల తయారీ గుట్టురట్టు

**ఒకరి అరెస్ట్.. మరొకరు పరారీ**

**ఆదిలాబాద్, మహా** ప్రభుత్వ శాఖలకు సంబంధించిన నకిలీ పత్రాలు, నకిలీ స్టాంపులతో ధ్రువపత్రాలు సృష్టిస్తున్న తండ్రి కొడుకులలో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం ఏఆర్ హెడ్ క్వార్టర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొని కేసు వివరాలను వెల్లడించారు. స్థానిక శాంతి నగర్ కు చెందిన లడ్వే రాహుల్ తండ్రి బద్రినాథ్ కు ప్రింటింగ్ ప్రెస్ ఉండేదని, వీరి వివిధ శాఖల నకిలీ స్టాంపులను తయారు చేసి వాటి సహాయంతో ధ్రువపత్రాలు సృష్టించారని తెలిపారు. పక్కా సమాచారంతో పోలీసులు గురువారం రాత్రి శాంతి నగర్లోని రాహుల్ ఇంటిపై దాడులు జరపగా... రబ్బర్ స్టాంపులతో పాటు నకిలీ పత్రాలు, 19 జీబీ డాటా కలిగిన రెండు హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులతో పాటు డీజీపీ సంతకాన్ని సైతం ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను తయారు చేసినట్టు తమ విచారణలో తేలిందన్నారు. ఇందులో ముగ్గురి డాటా దొరికిందని, కంప్యూటర్ తో పాటు హార్డ్ డిస్క్ డాటాను పరిశీలించి ఎవరైతే నకిలీ పత్రాలు తీసుకున్నారో వారిపై చర్యలు తీసుకోవడానికి తదుపరి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఉ అదే విధంగా నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఉందని, వారిని సైతం త్వరలో అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీసీఎస్ ఇన్స్ పెక్టర్ చంద్రశేఖర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**





**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శనివారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవనంలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖ కార్యాలయాల రిజిస్టర్లు, రికార్డులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరు పట్టికలు, ఆయా కార్యాలయాల పరిధిలో కొనసాగుతున్న పనుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు పనిచేస్తున్నాయని అన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రజలకు చేరువలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించి, వివిధ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నేనిచ్చిన మాట నా ప్రతిజ్ఞ... దాన్ని నిలబెట్టుకోవడం నా బాధ్యత...

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




**షాద్ నగర్, మహా:** నేనిచ్చిన మాట అది నా ఆత్మకు మూలం... చేసుకున్న ప్రతిజ్ఞ కఠిన శిలకు సత్యం.... దాన్ని నిలబెట్టుకోవడం నా బాధ్యత పవిత్రం... నాకది గౌరవం, నలుగురిలో సగౌరవం.... పలికిన పలుకుకు నేనే ప్రాణం, నేనే తోడు అంటూ మాటకు కట్టుబడి ఉండటమే తన జీవిత సత్యంగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. అందులో భాగంగానే శనివారం షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని 3,21,6,7,9,10 వార్డుల్లో గల పలు కాలనీలలో పార్కులు, సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజి పనులను ఆయన భూమి పూజ కార్యక్రమాలు చేపట్టారు. షాద్ నగర్ మున్సిపల్ ను మోడల్ మున్సిపల్ గా తీర్చిదిద్దడంలో భాగంగా వార్డుల వారీగా 21కోట్ల పైచిలుకు నిధులతో ఆయా వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు డప్పు వాయిద్యాలతో ఘన పలుకుతూ శాలువాలతో సత్కరించి వార్డులో అభివృద్ధికి మేము సైతం అంటూ ఎమ్మెల్యే వెంట నడిచారు. అభివృద్ధి కార్యక్రమాల అనంతరం పదో వార్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో మాట్లాడుతూ... షాద్ నగర్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు అవసరమైన పనులను చేపట్టడితేనే అసలైన ఆనందం, తృప్తి ఉంటుందన్నారు. సుమారు 100 కోట్ల నిధులతో మున్సిపల్ సుంద్రీకరణ చేపట్టబోతున్నామని అందులో భాగంగానే నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలు, మరో రెండు రోజుల్లో మిగతా వార్డులో మిగతా సహితం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నామన్నారు.



## ఫీలె చిక్ ఫ్యాషన్ డిజైన్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ మహా:** మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్ సి ఐ,బాలాపూర్ రోడ్ లో ఏర్పాటు చేసిన ఫీలె చిక్ ఫ్యాషన్ డిజైన్ ఎగ్జిబిషన్ ను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. మహిళలకు నచ్చే విధంగా వైవిధ్య భరితమైన ఆభరణాలు,డ్రస్సులు చీరలు,ఆభరణాలు అందుబాటు లో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్ చుట్టుపక్కల ప్రజలు సందర్శించి తమకు ఇష్టమైన వాటిని తక్కువ ధరలో పొందవచ్చని తెలిపారు. కొత్త డిజైన్లు,సరికొత్త ఫ్యాషన్ వస్తువుల తో,సెలెక్ట్ చేసిన వాటి పై ప్రత్యేకమైన డిస్కౌంట్ లో కస్టమర్లకి అందుబాటులో కలవని నిర్వాకులు వెల్లడించారు. ఈ కార్యక్రమం లో మీర్ పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆర్కాల కామేష్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జగన్నాథుని రథయాత్ర

**బాలాపూర్ మహా:** ఇస్కాన్ హైదరాబాద్ దేవాలయ మేనేజ్మెంట్ కమిటీ శ్రీమాన్ రాదే శ్యామ్ ప్రభు ప్రమేయంతో ఇస్కాన్ అబిడ్స్ మార్గదర్శకంలో లీలా సుఖదాస్, రోహిణి సర్వ పావని దేవిదాసి, శ్యాంసుందర్ దాస్, శ్రీనివాసులు ఆధ్వర్యం లో హస్తినాపురం డివిజన్ అగ్రికల్చర్ కాలనీ గణేష్ మండపం నుంచి జగన్నాథ రథయాత్రను ప్రారంభించారు. హస్తినాపురం లో మొట్ట మొదటిసారిగా వందలాది మంది భక్తుల తో జగన్నాథ రథయాత్రను హస్తినాపురం డివిజన్ లో అగ్రికల్చర్ కాలనీ విశ్వేశ్వరయ్య కాలనీ ద్వారకా నగర్ కాలనీ మీదుగా తిరుగుతూ,సంస్కృతిక కార్యక్రమాలు,భజనలు చేస్తూ ఆధ్యాత్మిక శోభతో బొబ్బిలి దామోదర్ రెడ్డి గార్డెన్ వరకు ఘనంగా రథయాత్రను నిర్వహించారు. హస్తినాపురం డివిజన్ లో ఆధ్యాత్మిక వెల్లువిరుస్తుందని ప్రజలందరూ కలిసి మెలిసి వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని లీలా సుఖ దేవ్ జి తెలిపారు. ప్రతి శనివారం హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీలో గణేష్ మండపం వద్ద సాయంత్రం 6:30 నుంచి 8:30 వరకు భగవంతుని ప్రవచనాలు చెప్తామని వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని అందిస్తామని వారు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితం లో దైవభక్తి ఉండాలని మానసిక ప్రశాంతత కోసం ఇష్టదైవాలను పూజించాలని అన్నారు.



## నీటి గుంతలో పడి అక్క.. తమ్ముడు మృతి



**ఆదిలాబాద్, మహా:** దురదృష్టవశాత్తూ నీటి గుంతలో పడి అక్క, తమ్ముడు మృతి చెందిన ఘటనతో మావలలో విషాదం నింపింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు, కొడుకును ఒకేసారి పోగొట్టుకున్న ఆ తల్లితండ్రులు, కుటుంబీకుల రోదనలు అక్కడున్న వారిని తీవ్రంగా కలిచివేశాయి. అప్పటివరకు తమ ముందే ఆడుకుంటూ కనిపించిన అక్క, తమ్ముడు ఇక లేరన్న చేదు నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఎంతో ఉన్నతమైన భవిష్యత్తు కలిగిన పిల్లలిద్దరూ నిమిషాల వ్యవధిలో విగతజీవులుగా మారడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే... మావలకు చెందిన స్వామి కుమారుడు విధాత(8) కూతురు వినూత్న(11)లు శనివారం గ్రీన్ సిటీ సమీపంలో సైకిల్ మీద వెళుతుండగా ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడ్డారు. అందులో ఊపిరాడక మృతి చెందారు. గమనించిన స్థానికులు వారి మృతదేహాలను నీటి కుంటలో నుంచి బయటకు తీసిన దృశ్యాలు అక్కడున్న వారిని కలిచివేశాయి. చిన్న పిల్లలను పోగొట్టుకున్న తల్లితండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాలను రిమ్స్ మార్చురీకి తరలించగా.... విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా




**వరంగల్, మహా;** వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని గోదాములను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి శనివారం పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డు లోని జిల్లా ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ చేసి,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ గోదాంలకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రత చర్యలు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ గురించి వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# కాటారం మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

### ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా శాఖ అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్



**కాటారం, మహా :** కాటారం మండల ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా మండల కేంద్రంలో నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పవిత్రం శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండల సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు మండల శాఖ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. ఎన్నికల అధికారిగా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి తణుకు శ్రీనివాస్ భూపాలపల్లి పరిశీలకులుగా భూపాలపల్లి పట్టణ మాజీ అధ్యక్షులు పాలవరపు శ్రీనివాస్ వ్యవహరించారు. మండలంలోని ఆర్యవైశ్యులంతా కార్యక్రమానికి హాజరయ్యారు. మండల శాఖ అధ్యక్ష పదవికి మద్ది నవీన్ కుమార్ ఒక్కరే నామినేషన్ వేశారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు బచ్చు ప్రకాష్ ప్రతిపాదించగా కలికోట శ్రీనివాస్ బలపరిచారు. మండల సంఘం ఎన్నికలకు ఎలాంటి పోటీ లేకపోవడంతో మద్ది నవీన్ కుమార్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తనుకు శ్రీనివాస్, పరిశీలకులు పాలారపు శ్రీనివాస్ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య మండల శాఖ నూతన అధ్యక్షుడు నవీన్ కుమార్ ను భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పవిత్రం శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా మద్ది నవీన్ కుమార్ ఎన్నికైన అనంతరం ప్రధాన కార్యదర్శిగా బీరెల్లి రమేష్, కోశాధికారిగా దారం నందకిషోర్ లకు కార్యవర్గాన్ని విస్తరించినట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఆర్యవైశ్య మహాసభ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పవిత్రం శ్రీనివాస్, అనంతుల శ్రీనివాస్ మండలం లోని ఆర్యవైశ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎన్నికల అధికారులుగా వచ్చిన తనుకు శ్రీనివాస్ పాలరపు శ్రీనివాస్, రాజులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్లాడి సదాశివ్, అనంతుల రమేష్‌బాబు, మండల అవోపా అధ్యక్షుడు మద్ది లక్ష్మీ నరసింహమూర్తి,బచ్చు ప్రకాష్,కలికోట శ్రీనివాస్, రావికంటి అశోక్, మద్ది రాజబాబు, చందా విజయభాస్కర్, అల్లాడి చంద్రమౌళి, అల్లాడి ఓం ప్రకాష్, భీమారపు రాజబాబు,పదకంటి ప్రకాష్, మద్ది రవికుమార్, పల్లెపాటి ప్రకాష్, అల్లాడి మహేష్,చిట్టూరి శ్రీనివాస్,దారం సంతోష్, బీరెల్లి తిరుమలేష్, మద్ది శ్రీమన్ నారాయణ, అల్లాడి కిరణ్, చిట్టూరి రవీందర్ లు పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఆర్యవైశ్య సంఘం సభ్యులంతా శుభాకాంక్షలు తెలుపుతూ ఒక్కొక్కరుగాఅభినందించారు.

## అవయవ దానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ మహా;** అవయవ దానం పై ప్రజల్లో అవగాహన పెరగాలని మరొక వ్యక్తికి పునర్జన్మను ఇవ్వడానికి జీవన్ దాన్ మహాదానమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ వరంగల్ శాఖ, టీ 9 ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని ఆబ్నస్ ఫంక్షన్ హాల్ లో నేత్ర అవయవ శరీర దానం పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ముఖ్య అతిథిగా పాల్గొని, అతిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవయవ దానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. సమాజానికి మంచి చేయాలనే ఆలోచన కలగాలని, అవయవ దానంతో మరికొందరి జీవితాల్లో వెలుగు నింప వచ్చునని, దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన కల్పించాలని సూచించారు. రోగిని బ్రతికించే వాళ్ళు డాక్టర్లు దేవుళ్ళు అయితే దానం చేసిన వారు దైవదూతలన్నారు . అవయవ దానం పై అవగాహన కార్యక్రమాలను ఉధృతం చేయాలని కలెక్టర్ కోరారు. దాతలకు అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు, నిర్వాహకులకు అధికారులు వైద్య సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అవయవ దానం చేసి చిరంజీవులు గా మిగిలిపోవాలని అవయవ దానం చేయుటకు అంగీకరించిన వారిని శాలువాలతో కలెక్టర్ సత్కరించారు.

## భూ కబ్జాలు చేస్తూ బెదిరింపులు..

### 9 మందిపై కేసు..ఐదుగురి అరెస్ట్.. డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి..




**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ పట్టణంలో భూకబ్జాలతో పాటు బెదిరింపులకు పాల్పడిన 9 మందిపై కేసు నమోదు చేసి, ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. శనివారం మావల పోలీస్ స్టేషన్ లో మీడియాతో మాట్లాడారు..ఖానాపూర్ ప్రాంతంలోని వివిధ భూముల పత్రాలను ఫోర్జరీ చేసి,ప్లాట్లను అక్రమంగా ఆక్రమించి,డబ్బు డిమాండ్ చేస్తూ నిజమైన ఆస్తి యజమానులను బెదిరింపులకు గురిచేసినట్లు తెలిపారు.2009లో జానకొండ పోసాని కొనుగోలు చేసిన ప్లాట్లను నిందితులు తప్పుడు పత్రాలతో ఆక్రమించి.. మున్సిపల్ అధికారులను మోసం చేసి ఇంటి నంబర్లను పొందారన్నారు.కాగా 17జూలై 2023న ఫిర్యాదు దారు నుండి రూ.1 లక్ష వసూలు చేసి,తప్పుడు ప్రభుత్వ భూమి పత్రాలను అప్పగించారన్నారు.ఈ ముఠా ఖాళీ ప్లాట్లను గుర్తించి,నకిలీ పత్రాలు సృష్టించి సులభంగా డబ్బు సంపాదించడమే అలవాటు చేసుకున్నట్లు విచారణలో తేలిందన్నారు.ఈ మేరకు ఐదుగురు నిందితులు పైక్ రావు ఆనంద్,సద్దాం,షేక్ షాదుల్లా ,బోడకుంట్ల రాజు, షేక్ అజీముద్దీన్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు.మిగిలిన నలుగురు నిందితులు సంతోష్,మనోహర్,షాబానా బేగం,హీనా అంజుమ్ పరారీలో ఉండగా..వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఫ్లాట్ హౌస్ నెంబర్ కు సహకరించిన మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుదర్శన్,రెవెన్యూ ఆఫీసర్ జాదవ్ కృష్ణ లపై కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో మావల ఎస్ హెచ్ ఓ సీఐ స్వామి,ఎస్సై ముజాహిద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకే డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలి

### మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి మంచాల, నోముల, లింగంపల్లి గ్రామాల్లో 96 మంది గూడు లేని నిరుపేదలకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, వీడియో గ్రాఫ్ సమక్షంలో లాటరీ విధానం ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించడం జరిగిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ఎమ్మెల్యే ఈ కేటాయింపులను రద్దు చేస్తూ కొత్త లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్, అనుచరులకు కేటాయించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి నోములలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల స్థలానికి చేరుకుని, గతంలో కేటాయించిన లబ్ధిదారులకు పూర్తి మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సంబంధిత అధికారులను సంప్రదించి, లబ్ధిదారుల హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వారికి మంచినీటి, ఎలక్ట్రిక్ సౌకర్యాలు అందజేసేలా మంచిరెడ్డి అధికారులకు సూచించారు. మంచిరెడ్డి చొరవతో న్యాయం జరుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు అనేక పథకాలు అందాయని వాటిలో భాగమే ఈ డబుల్ బెడ్ రూమ్లని స్పష్టం చేశారు.

# సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు

- అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యం..
- దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం..
- రేగొండ, చిట్యాల, భూపాలపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే జీఎస్సార్..
- భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి..
- రేగొండ పీఏసీఎస్, చిట్యాల డీసీసీబీ కార్యాలయ ఆవరణాల్లో మొక్కలను నాటి, నీరు పోసిన ఎమ్మెల్యే



**భూపాలపల్లి, మహా :** సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ, కొత్తపల్లి గోరి, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్ళపల్లి, గణపురం, భూపాలపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలతో పాటు భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లోని మొత్తం 191 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు రూ.61,10,500 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సభల్లో ఎమ్మెల్యే కార్యక్రమానుద్దేశించి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు.మానవతాదృక్పథంతో సీఎం రేవంత్ రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరగా నిలుస్తుందన్నారు. బాధితులకు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

**రేగొండ పీఏసీఎస్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను నాటిన ఎమ్మెల్యే జీఎస్సార్..**

భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. ఈరోజు నియోజకవర్గ పర్యటనలో భాగంగా రేగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) కార్యాలయ ఆవరణలో చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని, మొక్కను నాటి, నీరు పోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... విరివిరిగా మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ అందుతుందన్నారు. అంతేకాకుండా, విరివిగా వర్షాలు పడి పంటలు కూడా పుష్కలంగా పండుతాయన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. చిట్యాల మండల కేంద్రంలోని నవాబుపేట రోడ్డులో ఉన్న డీసీసీబీ బ్యాంకు ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు.పర్యావరణ పరిరక్షణకు అందరూ తమ వంతుగా మొక్కలను ఎమ్మెల్యే కోరారు. బ్యాంకు మేనేజర్, సిబ్బంది ఎమ్మెల్యేకు మేనేజర్ ఛాంబర్ లో శాలువా కప్పి సన్మానం చేశారు.

## తవ్వకాల్లో దేవతా మూర్తి విగ్రహం




**రంగారెడ్డి జిల్లా మహా:** అమ్రాబాద్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు చేస్తుండగా తవ్వకాలలో బయటపడ్డ ఈదమ్మ తల్లి విగ్రహము. నాగర్ కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ హాస్పిటల్ చివర మెయిన్ రోడ్డు పై, మన పూర్వీకులు చెప్పినట్టుగా ఈదమ్మ దేవాలయం వద్ద రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించిన సందర్భంగా, తవ్వకాలలో ఈదమ్మ తల్లి విగ్రహము బయటపడడం జరిగింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేయడం జరిగింది. రోడ్డు విస్తరణ పనులు అవ్వగానే అక్కడే దేవాలయ నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను గ్రామస్తులు కోరారు.

## 31 మంది మందుబాబులకు జైలు శిక్ష

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ మహా;** మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా గత వారంలో 31 మంది వాహనదారులు జైలు శిక్ష అనుభవించారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వానదారులు మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా పత్యక్షంగాని, పరోక్షంగాని రోడ్డు ప్రమాదాలకు ప్రధానకారకులు కావడంతో కొన్ని సందర్భాల్లో సదరు మద్యం సేవించి వాహనదారుడు సైతం రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. తద్వారా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇది దృష్టిలో వుంచుకోని వరంగల్ పోలీస్ కమిషనరేట్ మద్యం సేవించి వాహనదారుల వలన కలిగే రోడ్డు ప్రమాదాల నివారణకై వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ఇందులో భాగంగా వరంగల్ ట్రైసిటి పరిధిలో ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసులు నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని. అలాగే గ్రామీణా ప్రాంతాల్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడుతున్నాయి. ప్రధానంగా వరంగల్ ట్రై పరిధిలో ట్రాఫిక్ పోలీసులు చేపట్టే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు ముందుగా కమిషనరేట్ కార్యాలయములోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ వాహనదారుల కుటుంబ సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం కోర్టులో న్యాయమూర్తి ఎదుట పర్చడం ద్వారా వాహనదారులకు కోర్టులో జైలు శిక్ష లేదా జరిమానా విధించడం జరుగుతుందని. వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో నెల 28 వ తేది వరకు వారం ట్రైసిటి ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 376కేసులు నమోదు కాగా, ఇందులో 31 మందికి వాహనదారులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వగా, 3లక్షల 83వేల రూపాయలు వాహనదారుల పై ఫైన్ రూపంలో కోర్టులో జరిమానాలు చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. నమోదైన కేసుల్లో అత్యధికంగా హన్మకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 138 కేసులు నమోదు కాగా ఇందులో 10 మందికి జైలు శిక్ష పడగా, 96వేల ఎనిమిది వందల రూపాయల్లో వాహనదారులు కోర్టు లో జరిమాన చెల్లించారు. ఇదే రీతిలో వరంగల్ పరిధిలో 134కేసులో 15మంది కి జైలు శిక్ష, 1లక్ష 77వేల ఒక వంద రూపాయల జరిమాన, కాజీపేట పరిధిలో మొత్తం 104కేసులు నమోదు కాగా ఇందులో అరుగురికి జైలు శిక్ష పడగా, మిగితా కేసుల్లో మొత్తం ఒక లక్ష 9వేల వందల రూపాయలు జరిమానా చెల్లించారని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వాహన దారులకు సూచన చేస్తూ మీ కుటుంబాన్ని దృష్టిలో వుంచుకోని వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని, మీరు చేసే తప్పిదాలతో ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయినవారు కొందరైతే మరి కొందరు ఆంగవైకల్యంగా జీవితాలను కొనసాగిస్తూన్నారని ఇకనైన వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని కోరారు.

## నేడు తొలి ఏకాదశి పండుగ..

### వేడుకలకు దేవాలయాలలో ఏర్పాట్లు

**కాటారం, మహా :** ఉగాది తర్వాత ప్రజలకు తొలి ఏకాదశి పెద్ద పండుగ. ఆషాడ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం ప్రజలు జరుపుకోనున్నారు. తొలి ఏకాదశి నుండే పండుగలు ప్రారంభమవుతాయి చయన ఏకాదశిగా పిలిచే ఈరోజు పాలకడలిలో క్షేమంగా నారాయణుడు క్షమించి ఆర్థిక శుద్ధ ఏకాదశి నాడు మేలుకొంటాడని శాస్త్రాలు చెబుతున్నాయి చాతుర్మాస్య దీక్షలో భాగంగా గృహస్తులు స్వామీజీలు యతీశ్వరులు పీఠాధిపతులు నాలుగు నెలలకు పైగా దీక్షలో ఉంటారు ఏ దాదిలో వచ్చే 24 ఏకాదశి లలో తొలి ఏకాదశికి విశిష్టత ఉంది ఈ మాసం వాతావరణం తొలకరి ప్రారంభంతో వర్షాలు కురిసి పంటలకు అనుకూలంగా మారుతాయి దైవానుగ్రహానికి పండుగల ప్రారంభానికి కారణమైన తొలి ఏకాదశి రోజున నదులలో పుణ్యస్నానాలు, పుణ్యక్షేత్ర దర్శనాలు, వ్రతాలు, దానధర్మాలు, ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హవనాలు నిర్వహిస్తారు. పిల్లలు పిండి వంటల విందులు కబుర్లతో కాలక్షేపం చేస్తారు రైతులు వేడుకగా జరుపుకునే ఈ ఏకాదశినే పూర్వం సంవత్సరాలంబంగా పరిగణించేవారు ప్రకృతి వైపరీత్యాలు రావద్దని పంటలకు తెగుళ్లు సోకవద్దని రైతులు ప్రార్థిస్తారు. తొలి ఏకాదశి రోజున శ్రీ మహా విష్ణువును పూజించడం ఎంతో శ్రేష్టం ఉదయమే నదులలో స్నానం చేయడం, దేవాలయాలకు వెళ్లి స్వామిని దర్శించి పూజలు చేయాలి తొలి ఏకాదశి అంటే ఎన్ని రకాలుగా తొలిసారిగా వచ్చేది భగవంతుని ధ్యానిస్తూ చాతుర్మాస్య దీక్షలను స్వీకరిస్తారు.



## జర్నలిస్ట్ మహేందర్ దశదినకర్మకు హాజరైన పాత్రికేయులు

**వరంగల్ మహా;** దివంగత సీనియర్ జర్నలిస్ట్, ది హన్స్ ఇండియా వరంగల్ బ్యూరో చీఫ్ ఆడెపు మహేందర్ దశదినకర్మ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆరేపల్లి సమీపంలోని వీకే గార్డెన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, బంధుమిత్రులు, సహచర జర్నలిస్టులు హాజరై మహేందర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, పూర్వ అధ్యక్షులు పిన్నా శివకుమార్, గడ్డం కేశవమూర్తి, ఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, పాత్రికేయులు గోకారపు శ్యాం, సిరిమల్లె సదానందం,డిఆర్ఓ వైవీ గణేష్, సంపతి ప్రభాకర్, ఉసనగిరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ సతీమణి ఆడెపు లావణ్య, కుమారుడు సిద్ధార్థ్ లను పరామర్శించారు. మహేందర్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ పిన్నా శివకుమార్ భావోద్వేగానికి గురయ్యారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

# నగర శానిటేషన్ విధానాలు ఆదర్శంగా నిలవాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- సానిటేషన్ మలేరియా విభాగ అధికారులతో సమీక్షా సమావేశం...



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో అవలంబించే శానిటేషన్ విధానాలు ఇతర మున్సిపాలిటీ లకు ఆదర్శం గా నిలవాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కమిషనర్ ఛాంబర్ లో సానిటేషన్ మలేరియా విభాగ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతం గా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సానిటేషన్ కు సంబంధించి 100% ప్రతి గృహం నుంచి చేత్త సేకరణ జరపడంతో పాటు తడి పొడి చెత్తను వేరుగా అందించేలా చూడాలని, ప్రతి వార్డులో కంపోస్టు యూనిట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వరంగల్ ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడానికి సమర్థవంతమైన శానిటేషన్ పద్ధతులను అవలంబించాలని, జిడబ్ల్యూ ఎంసీ అవలంబించే సానిటేషన్ విధానాలు ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలవాలని , బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం నూతనంగా తీసుకొచ్చిన పద్ధతి కాదని గతంలో నుండే అమల్లో ఉందని, దానిని సమర్థంగా నిర్వహించి పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా విధి నిర్వహణ చేసే విధంగా చూడాలని, వారికి అవసరమైన పనిముట్ల తో పాటు గ్లవ్ జులు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. పబ్లిక్ టాయిలెట్ నిర్వహణకు సంబంధించిన అప్లికేషన్(ఆప్) పనిచేయడం లేదని, రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, అట్టి ఆప్ ను వెంటనే సరి చేసి ప్రజా మరుగుదొడ్లను పనిచేసెలా చూస్తూ ఆప్ ను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని, పేమెంట్ చేసే, సర్టిఫికేషన్ చేసివి సక్రమం గా పని చేస్తున్నాయా లేదా అని పరిశీలించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "నమస్తే" కార్యక్రమం ప్రొఫైల్ ను పూర్తి చేసి అందుకు కావలసిన నైపుణ్యాల పై అవగాహన కలిగించాలని సానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. ప్లాస్టిక్, ఐఇసి కి సంబంధించి కార్పొరేషన్ సహాకారం తో ప్రజలలో అవగాహన కలుగజేయాలని, ప్లాస్టిక్ ఎన్ఫోర్స్ మెంట్ బృందాలను బలోపేతం చేసి కమర్షియల్ ప్రాంతాలలో రెండు చేత్త డబ్బాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించకుండా ప్రోత్సహించాలని, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లకు సంబంధించి సూచించిన డిమాండ్ ను కచ్చితంగా వసూలు చేయాలని, డిలీషన్ షాపులు ఏమైనా ఉంటే క్రాస్ వెరిఫికేషన్ చేసుకున్న తర్వాతే తొలగించాలని అన్నారు. సానిటరీ ఇన్స్పెక్టర్ వ్యవస్థను జవాన్ల అటెండెన్స్ ను స్ట్రీమ్ లైన్ చేయాల్సిన అవసరం ఉందని, జవాన్ లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడం లేదనే సమాచారం ఉందని, అటెండెన్స్ తీసుకునే క్రమంలో పరిశీలించాలని, స్వచ్ఛ ఆటో లకు అటెండెన్స్ ఇచ్చే క్రమంలో 100% ప్రతి గృహం నుండి చెత్త సేకరణ జరిపారో లేదో పరిశీలించాలని అన్నారు. మలేరియా విభాగానికి సంబంధించి స్థానిక డివిజన్ కార్పొరేటర్ ల సమన్వయంతో వారిని భాగస్వామ్యం చేస్తూ ఫాగింగ్ తో పాటు నీరు నిలిచి ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయించడం వంటి కార్యక్రమాలను చేపడుతూ స్థానిక ప్రజల ను ఇందులో భాగస్వాములను చేస్తూ నిర్వహించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలలో నీరు నిలవకుండా చూడాలని ఏ ప్రాంతాల్లో డ్రైన్లు బ్లాక్ అవుతాయో గుర్తించి అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు తొలగింపు ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం లో భాగం గా రూపొందించిన అవగాహన స్టిక్కర్లను ఆయా గృహాలకు అతికించాలని ఈ సందర్భంగా కమిషనర్ శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిఎంహెచ్ ఓ డా.రాజారెడ్డి, వెటర్నరీ వైద్యులు డా.గోపాల్ రావు, ఏం హెచ్ ఓ డా.రాజేష్, సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్, నరేందర్, ఐటీ మేనేజర్ రమేష్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, హెల్త్ ఇన్స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, తదితరులు, పాల్గొన్నారు.




## బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలందించాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ మహా;** ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏ. ఎస్. ఐ లుగా పదోన్నతి పొందిన పి. శ్యాం సుందర్, ఎస్. ప్రభాకర్, టి. కట్టస్వామి, వి. శంకర్, ఏ. అర్జున్ లు శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కు పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పదోన్నతి పొందిన ఏఎస్ఐలకు సూచించారు.



## కుడా వైస్ చైర్మన్‌గా చాహత్ బాజ్ పాయ్

**హన్మకొండ మహా;** కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా) వైస్ చైర్మన్ గా చాహత్ బాజ్ పాయ్ శనివారం హన్మకొండ లోని కుడా కార్యాలయం లో పదవి బాధ్యతలు చేపట్టారు. బల్దియా కమిషనర్ గా కొనసాగుతున్న చాహత్ బాజ్ పాయ్ ను కుడా వైస్ చైర్మెన్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన తరుణం లో పదవి బాధ్యతలు చేపట్టారు.



## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 30వ డివిజన్ ప్రెసిడెంట్ రమేష్, నాయకులు బొంత సారంగం ఆధ్వర్యంలో బిఆర్ ఎస్ పార్టీ నుండి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బాలసంద్రం లోని తన క్యాంపు కార్యాలయంలో కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన నచ్చి ఆకార్షితులై కాంగ్రెస్ లో చేరుతున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని, ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన తనవద్దకు రావాలని ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని అన్నారు. అంతకు ముందు ప్రజా ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి పాలన నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని బిఆర్ ఎస్ నాయకులు తెలిపారు.

# రోబో ఇసుక.. ఇప్పుడిదే ప్రత్యామ్నాయం


నది ఇసుక కొరత, అధిక ధరల కారణంగా గ్రేటర్ నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఇసుక రవాణా దారులు రేట్లు పెంచడం నిర్మాణ రంగానికి మరింత భారంగా పరిణమించింది. మహానగరంలో ఇసుక దొరకడం గగనమవడంతో బిల్డర్లు ప్రత్యామ్నాయంగా రోబో ఇసుక వినియోగాన్ని పెంచారు.

**ధర తక్కువే..**

ఇప్పటికే కాంక్రీట్ మిక్సింగ్ యూనిట్లలో రోబో ఇసుక (క్రష్డ్ రాక్ సాండ్)ను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. ఇసుక రేట్లతో పోలిస్తే దీని ధర ఎంతో తక్కువ. అయితే రోబో ఇసుక విరివిరిగా దొరక్కపోవడం.. ప్రత్యేకంగా కొన్ని క్రషర్లలోనే ఇలాంటి ఇసుకను ఉత్పత్తి చేస్తుండటంతో సాధారణ గృహ నిర్మాణాల్లో దీని వినియోగం తక్కువగా ఉంది. అలాగే రోబో ఇసులాగే మెటల్ క్రషింగ్ స్టోన్ డస్ట్ కూడా ఉండటం వీటిలో నాణ్యమైన ఇసుకను గుర్తించడం కష్టంగా మారుతోంది.

**రోబో తయారీ ఈజీ..**

నగర శివార్లలో విరివిగా లభ్యమయ్యే గ్రనైట్ శిలలతో రోబోశాండ్‌ను ఉత్పత్తి చేయవచ్చు. మెటల్ క్రషర్స్‌లో మిగిలిన వ్యర్థ శిలలను 2ఎంఎం, 1ఎంఎం పరిమాణంలో క్రష్ చేసి జల్లెడ పడితే ఈ ఇసుక తయారవుతుంది. తక్కువ సమయంలో నాణ్యత కలిగిన ఇసుకను తయారు చేయవచ్చన్నది నిపుణుల మాట. ఈ ఇసుకను నగరంలో రెడీమిక్స్ యూనిట్ల ద్వారా భారీ నిర్మాణాలకు వినియోగిస్తున్నారు.



# ఎల్ఐసీ మరో రెండు పాలసీలు



**న్యూఢిల్లీ:** దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) మరో రెండు పాలసీలను ప్రవేశపెట్టింది. నవ్ జీవన్ శ్రీ, నవ్ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం ప్లాన్లను శుక్రవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ సత్‌పాల్ భానో మాట్లాడుతూ.. యువతను దృష్టిలో పెట్టుకొని ఈ రెండు పాలసీలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు, ముఖ్యంగా యువతరం వారి కలలు, లక్ష్యాలు, బాధ్యతలను నెరవేర్చుకోవాలనుకునేవారి అవసరాలను తీర్చడానికి, భద్రతను అందించడానికి ఈ పాలసీల ముఖ్య ఉద్దేశమన్నారు. సింగిల్ ప్రీమియం, నాన్‌లింక్డ్ ఇండివిజ్వర్ ప్లాన్లతో పొదుపుతోపాటు భద్రతను కూడా ఇవ్వనున్నది.



## 143 గనుల మూసివేత

**హైదరాబాద్ :** జాతీయంగా ఇప్పటి వరకు 143 మైనింగ్ ప్రాజెక్టులను మూసివేసినట్టు కేంద్రబొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి ప్రకటించారు. మైనింగ్ పూర్తయిన అనంతరం డీకోల్ అయ్యాయని, ఈ మైన్స్ అన్నింటిలోనూ గనుల మూసివేత తర్వాత అభివృద్ధిచేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన వరల్డ్ మైనింగ్ కాంగ్రెస్ సదస్సులో ఆయన ప్రసంగించారు. రాబోయే మూడేండ్లల్లో మైన్‌క్లోజర్ యాక్టివిటీస్ చేపడతామని పేర్కొన్నారు.


**ఎన్ఎఫ్‌టీడీసీతో సింగరేణి ఎంఓయూ**

అరుదైన భూ మూలకాల ఉత్పత్తి రంగంలో ప్రవేశించేందుకు సింగరేణి సంస్థ నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్(ఎన్ఎఫ్‌టీడీసీ)తో ఎంవోయూ కుదుర్చుకున్నది.

## పాకిస్థాన్‌లో మైక్రోసాఫ్ట్ కార్యాలయం
# మూసివేత

ప్రపంచ టాప్ టెక్ కంపెనీలో ఒకటైన మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్ కార్యాలయానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌లో తన కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశంలో 25 సంవత్సరాలుగా సర్వీసులు అందిస్తున్న కంపెనీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో స్థానికంగా తన సర్వీసులను ముగించినట్లయింది. కంపెనీ గ్లోబల్ వర్క్‌ఫోర్స్ తగ్గింపు వ్యూహంలో భాగంగా పాకిస్థాన్‌లో ఈమేరకు మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇప్పటికే స్థానికంగా ఉన్న క్లయింట్లకు క్షేత్రస్థాయిలో సర్వీసులు అందించేందుకు కంపెనీ ప్రాంతీయ కేంద్రాలు, అధీకృత రీసెల్లర్ల ద్వారా రిమోట్ సేవలు అందిస్తామని పేర్కొంది. ప్రస్తుత కస్టమర్ ఒప్పందాలు, సేవలు ప్రభావితం కాకుండా కొనసాగుతాయని తెలిపింది. ఆయా కంపెనీలకు నిత్యం మద్దతుగా నిలుస్తామని కంపెనీ హామీ ఇచ్చింది. పాకిస్థాన్‌లో కంపెనీ తీసుకున్న నిర్ణయం వల్ల స్థానికంగా కేవలం కొద్దిమంది ఉద్యోగులు మాత్రమే ప్రభావితం చెందినప్పటికీ అక్కడి వ్యాపార, సాంకేతిక వర్గాల్లో ఆందోళనలు మొదలయ్యాయి. భారతదేశంలో మాదిరిగా కాకుండా మైక్రోసాఫ్ట్ పాకిస్థాన్‌లో అభివృద్ధి లేదా ఇంజినీరింగ్ సర్వీసులు స్థాపించేందుకు ఎప్పుడూ ఆసక్తి చూపలేదు. కేవలం అక్కడి యూనిట్ ద్వారా తన ప్రోడక్టులను ఇతర కంపెనీలతో అనుసంధానం చేసేందుకు, అమ్మకాల కార్యకలాపాలకే పరిమితం చేసింది. మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా భారీ ఉద్యోగాల కోతకు అనుగుణంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఇటీవల మొత్తంగా కంపెనీలో పని చేస్తున్న 9,000 పైగా ఉద్యోగాలను తగ్గించింది. ఈ విస్తృత సంస్థాగత పునర్నిర్మాణమే సంస్థ పాకిస్థాన్ నుంచి నిష్క్రమించేందుకు కారణమని ఆ దేశ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పేర్కొంది. వాస్తవానికి మైక్రోసాఫ్ట్ ఇప్పటికే పాక్ లైసెన్సింగ్, కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ వంటి ప్రధాన విధులను కొన్ని సంవత్సరాలుగా ఐర్లాండ్‌లోని తన యూరోపియన్ హబ్‌కు మారుస్తోంది. అంతర్జాతీయంగా చాలాదేశాల్లో పాకిస్థాన్ ఉగ్రవాదానికి సంబంధించి వ్యతిరేకత ఉంది. స్థానికంగా పేదరికం పెరుగుతోంది. పాక్ ఆర్థిక వ్యవస్థ ఏటా దారుణంగా క్షీణిస్తోంది. దాంతో చాలా కంపెనీలు తమ కార్యకలాపాలను పరిమితం చేస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీ ఇలా మొత్తంగా తన కార్యాలయాన్ని షట్‌డౌన్ చేయడం అక్కడి టెక్ వర్గాలకు ఆందోళన కలిగిస్తోంది.




## పీవీఆర్ ఐనాక్స్ 75 కోట్ల పెట్టుబడి

**హైదరాబాద్ :** మల్టీప్లెక్స్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ తాజాగా హైదరాబాద్‌లో మరో నాలుగు స్క్రీన్లతో సినిమా హాల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ బిజ్లీ మాట్లాడుతూ.. తెలంగాణలో వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి వచ్చే రెండు నుంచి మూడేండ్లకాలంలో రూ.75 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నట్టు, దీంతో మరో ఐదు మల్టీప్లెక్స్‌ల్లో 20 స్క్రీన్లు అందుబాటులోకి తీసుకురానున్నట్టు ప్రకటించారు. తద్వారా 400 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

## ఆట బొమ్మల ఉత్పత్తికి ప్రోత్సాహం..
# త్వరలో కొత్త పథకం



పరిశ్రమతో సంప్రదింపుల అనంతరం దేశంలో ఆట బొమ్మల ఉత్పత్తిని (టాయ్స్) పెంచేందుకు త్వరలోనే ఓ పథకాన్ని ఖరారు చేయనున్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. టాయ్స్ తయారీకి, ఎగుమతులకు భారీ అవకాశాలున్నట్టు చెప్పారు. టాయ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టీఏఐ) ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా మంత్రి గోయల్ మాట్లాడారు. ప్రభుత్వం తీసుకొచ్చే పథకం ఎగుమతులకు ప్రోత్సాహకాల రూపంలో ఉండదని.. దేశీయంగా తయారీని పెంచేందుకు, ఉపాధి కల్పనకు ఊతమిస్తుందన్నారు. డిజైన్ సామర్థ్యాలు, నాణ్యతతో కూడిన తయారీ, బ్రాండ్ నిర్మాణానికి మద్దతు రూపంలో ఈ పథకం ఉంటుందని చెప్పారు. ఒకప్పుడు ఆట బొమ్మల కోసం దిగుమతులపైనే పూర్తిగా ఆధారపడగా.. ప్రస్తుతం దేశీయంగానే పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడంతోపాటు, 153 దేశాలకు ఎగుమతులు చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. విధానపరమైన మద్దతు చర్యలు, నాణ్యతా ప్రమాణాల అమలు, స్థానిక తయారీ క్లస్టర్లను బలోపేతం చేయడం ద్వారా ఇది సాధ్యమైనట్టు వివరించారు.

140 కోట్ల జనాభా కలిగిన దేశం కావడంతో తయారీ కార్యకలాపాల విస్తరణతో సహజ ప్రయోజనం కలుగుతుందన్నారు. ఆట బొమ్మల ఎగుమతులను పెంచుకునేందుకు చక్కని బ్రాండింగ్, ఆకర్షణీయమైన ప్యాకింగ్, బలమైన డిజైన్‌పై దృష్టి సారించాలని పరిశ్రమకు గోయల్ సూచించారు. వినూత్నమైన ఆటబొమ్మల నమనాలను అభివృద్ధి చేసిన స్టార్టప్‌లకు పీఎం ముద్రాయోజన కింద పెద్ద ఎత్తున నిధుల మద్దతు అందించినట్టు చెప్పారు.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



## హమ్మయ్యా..
# ఊపిరి పీల్చుకున్న జపాన్



క్యాలెండర్‌లో తేదీ మారింది. ఎట్టకేలకు జపాన్ ఊపిరి పీల్చుకుంది. ఏదో విపత్తు ముంచేస్తోందని 'జపాన్ బాబా వాంగా' ర్యో తత్సుకి చెప్పిన కాలజ్ఞానం ఉత్తదేనని తేలిపోయింది. ప్రపంచమంతా ఎంతో ఆసక్తిగా జపాన్ డూమ్స్ డే.. చివరకు హుళక్కే అని తేలింది.

జులై 5, 2025న మెగా సునామీ జపాన్‌ను ముంచెత్తబోతోందన్న ప్రచారం.. ఉత్తి ఉత్కంఠగానే తేలిపోయింది. భారీ భూకంపంగానీ.. సునామీగానీ సంభవించలేదు. కొన్ని స్వల్ప ప్రకంపనలు, అగ్నిపర్వతం బద్దలు మినహా ఓ మోస్తరు ప్రకృతి వైపరిత్యాలు సంభవించలేదు. తేదీ మారినా.. ఏం జరగకపోవడంతో ఆ దేశ ప్రజలు హమ్మయ్యా.. అనుకుంటున్నారు.


1999లో ప్రచురించబడిన ఓ మాంగా (The Future I Saw) రచయిత ర్యో తత్సుకి.. జులై 5వ తేదీన విపరీతమైన భూకంపం, యుగాంతం తరహాలో సునామీ ముంచెత్తవచ్చని తన చిత్రాలతో బొమ్మలు గీసింది.

మీడియాతో పాటు సోషల్‌మీడియాలోనూ జపాన్ డూమ్స్ డే అంటూ హడావిడి నడిచింది. #JapanTsunami, #July5, #TheFutureISaw వంటివి ట్రెండింగ్ అయ్యాయి. కొంతమంది పర్యాటకులు పర్యటనలు రద్దు చేసుకున్నారు. అందులో భారత్ నుంచి కూడా చాలామంది ఉన్నారు. జపాన్ లోని ఆకుసెకిజిమా వాసులను అప్రమత్తంగా తరలించాల్సి వచ్చింది.

అయితే.. మేధావులు, సైంటిస్టులు.. ఆ భవిష్యవాణి నిరాధారమైనదిగా చెబుతూనే వస్తున్నారు. మరోవైపు అక్కడి వాతావరణ విభాగం కూడా.. భూకంపాలను అంచనా వేయలేమని మొత్తుకుంటూ వచ్చింది. చివరకు అదే నిజమని తేలింది.

# కూలిన బొగ్గు గని.. ఒకరు మృతి.. పలువురు విలవిల

**రామ్‌గఢ్:** జార్ఖండ్‌లోని రామ్‌గఢ్‌లో శనివారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి ఒక బొగ్గు గనిలో కొంత భాగం కూలిపోవడంతో ఒకరు మృతిచెందారు. వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం గనిలో పలువురు కార్మికులు చిక్కుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌గఢ్ జిల్లాలోని కర్మ ప్రాంతంలో ఈరోజు తెల్లవారుజామున ఈ ఉదంతం చోటుచేసుకుంది. ఈ ఘటన గురించి తెలియగానే ఒక బృందాన్ని సంఘటనా స్థలానికి పంపామని, రామ్‌గఢ్ డిప్యూటీ కమిషనర్ (డిసి) ఫైజ్ అక్ అహ్మద్ ముంతాజ్ తెలిపారు. ఘటనా స్థలంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయని, ఒక మృతదేహాన్ని వెలికితీసినట్లు వెల్లడించారు. గనిలో చాలామంది చిక్కుకున్నారని, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కొందరు గ్రామస్తులు బొగ్గు అక్రమ తవ్వకాలలో పాల్గొంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.





# విపత్తు మిగిల్చిన విషాదం..!
## పాపం అనాథగా ఆ చిట్టితల్లి..

ప్రకృతి వైపరిత్యాలు ఎవ్వరికి ఎలాంటి విషాదాన్ని ఇస్తుందో చెప్పలేం. అమాంతం ఉప్పెనలా విరుచుకపడే ఆ విలయం మిగిల్చే బాధ మాటలకందనిది. అందుకు సంబంధించి ఎన్నో ఉదంతాలను చూశాం. అలానే ఇటీవల కురిసిన భారీ వర్షాలు హిమచల్ ప్రదేశాన్ని ఎంతలా అతలా కుతలం చేశాయో తెలిసిందే. అయితే దాని కారణంగా అనాథగా మారిన ఓ చిట్టితల్లి ఉదంతం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇంతకీ ఆ చిన్నారి ఎలా బతికి బట్టగట్టకలిగిందంటే.. అసలేం జరిగిందంటే..ఎడతెరపిలేని వర్షాలకు వరదలు సంభవించి హిమచల్‌ప్రదేశ్ అతలాకుతలమైన సంగతి తెలిసింది. ఈ ప్రకృతి వైరిత్యం కారణంగా భారీగా ఆస్తి, జన నష్టం జరిగింది. అయితే ఈ దుర్ఘటనలో హిమచల్ ప్రదేశ్‌లోని సిరాజ్ అనే ప్రాంతంలో ఓ కుటుంబం మొత్తం ఈ విపత్తుకు బలైపోయింది. ఆ కుటుంబానికి చెందిన 11 నెలల కూతురు ఒక్కత్తే బతికి బట్టగట్టగలిగింది. ఈ విపత్తు కారణంగా ఒరిగిపోయిన చెట్లు, భవనాల శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి ఆ చిన్నారి లభించడం విశేషం. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా వచ్చిన వరదలకు ఆ చిన్నారి ఇల్లు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఘటనలో ఆమె తల్లి, తండ్రి, నానమ్మ చనిపోగా, ఆ చిన్నారి ఒక్కత్తే అనాథగా మిగిలిపోయింది. ఇవేమి ఆ చిన్నారికి తెలియక అమాయకంగా అందరిని చూస్తున్న తీరు అందరిని కలచివేస్తోంది. శిథిలంగా మారిన ఆ ఇల్లు పర్వాడ గ్రామానికి చెందని రమేష్ ఇల్లుగా గుర్తించారు. ఆ ఇల్లు డ్రెయిన్ సమీపంలో ఉండటంతో, జూన్ 30న కురిసిన వర్షాలకు నీటి ఉద్ధృతి ఎక్కువై కొట్టుకుపోయింది. అయితే దీనిని ముందుగానే గమనించి రమేష్ కూతురిని ఇంటిలోపల పడుకోబెట్టి, తన భార్య తల్లితో కలిసి ఇంటి వెనకకు వెళ్లాడు. అంతే ఆ వరద ప్రవాహంలో ముగ్గురు కొట్టుకుపోయారు. ఐతే చిన్నారి ఇంటిలోనే ఉండటంతో సురక్షితంగా శిథిలాల కింద బిక్కుబిక్కుమంటూ ఏడుస్తూ ఉందని చెబుతున్నారు అధికారులు. ఆ చిన్నారి పేరు నిఖితగా గుర్తించారు. అయితే రెస్క్యూ సిబ్బంది ఆ చిన్నారి తండ్రి మృతదేహాన్ని వెలికితీశారు కానీ తల్లి, భార్య మృతదేహాలు మాత్రం కానరాలేదు. అందుకోసం ముమ్మరంగా గాలించేందుకు రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగినట్లు వెల్లడించారు అధికారులు. ప్రస్తుతం ఆ చిన్నారి మేనత్త తారాదేవి సంరక్షణలో ఉన్నట్లు తెలిపారు. ఈ హృదయవిదారక ఘటన గురించి నెట్టింట వైరల్ అవ్వడంతో ఆ చిన్నారిని దత్తత తీసుకుంటామంటూ సోషల్ మీడియాలో పెద్దఎత్తున అభ్యర్థనలు రావడం విశేషం. విత్తుల సహాయ నిర్వహణ అధికారి స్మృతికా నేగి ఆ చిన్నారి నికితా బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఆ చిన్నారి తన మేనత్త పర్యవేక్షణలో ఉందని తెలిపారు. కాగా, ఈ హిమచల్‌ప్రదేశ్ వర్ష బీభత్సానికి సుమారు 700 కోట్ల మేర ఆస్తి నష్టంతోపాటు 69 మంది దాక మృత్యువాత పడ్డారు.

## మాల్‌లో మంటలు..
# లిఫ్ట్‌లో విద్యార్థి చిక్కుకుని..




**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో లిఫ్ట్‌లో చిక్కుకున్న ఒక విద్యార్థి దుర్మరణం చెందాడు. నాలుగు అంతస్తుల వాణిజ్య సముదాయ భవనంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగు అంతస్తుల వాణిజ్య భవనంలోని రెండవ అంతస్తులో మంటలు చెలరేగాయి. తొలుత ఫ్యాబ్రిక్, కిరాణ దుకాణంలో మంటలు అంటుకున్నాయి. ఫలితంగా విద్యుత్ నిలిచిపోయి లిఫ్ట్ ఆగిపోయింది. ఆ లిఫ్ట్‌లో చిక్కుకున్నవిద్యార్థి కుమార్ ధీరేంద్ర ప్రతాప్ సింగ్(25) ప్రాణాలు కోల్పోయాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను చల్లార్చేందుకు పలు ఇబ్బందులు పడ్డారు. ఈ భవనంలో ఒకే ప్రవేశ మార్గం, ఒకే నిష్క్రమణ మార్గం ఉంది. వివిధ వస్తువుల స్టాక్‌తో మెట్ల మార్గం అంతా మూసుకుపోయింది.

దీంతో పైఅంతస్తులకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దట్టమైన పొగ వెంటిలేషన్‌ను అడ్డుకుంది. దీంతో అగ్నిమాపక సిబ్బంది లోనికి వెళ్లేందుకు గోడను బద్దలు కొట్టవలసి వచ్చింది. మొత్తం పదమూడు అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే పనిలో పాల్గొన్నాయి. ఈ అగ్నిప్రమాదానికి ప్రాథమిక కారణం షార్ట్ సర్క్యూట్ అనే అనుమానాలున్నప్పటికీ, దర్యాప్తు తర్వాత అసలు కారణం వెల్లడవుతుందని అధికారులు తెలిపారు. ఈ ఘటన మరోసారి వాణిజ్య ప్రదేశాలలో పటిష్టమైన భద్రతా అవసరాలను గుర్తుచేస్తోంది.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | ఆదివారం, హైదరాబాద్ | 06-07-2025
ANN తెలుగు

## తమ్ముడు ఫస్ట్ డే కలెక్షన్స్..
# నితిన్ కెరీర్‌లో ఇదే తక్కువ




నితిన్ నటించిన 'తమ్ముడు' సినిమా జూలై 4న విడుదలైంది. దర్శకుడు వేణు శ్రీరాం ఈ మూవీని తెరకెక్కించారు. అయితే, ప్రేక్షకులను ఏమాత్రం ఈ మూవీ ఆకట్టుకోలేకపోయింది. దీంతో మొదటిరోజు చాలా తక్కువ కలెక్షన్స్ సాధించినట్లు సాక్‌నిక్ వెబ్‌సైట్ ప్రకటించింది. నితిన్ కెరీర్‌లోనే అత్యంత తక్కువ ఓపెనింగ్స్ తెచ్చుకున్న మూవీగా తమ్ముడు అని పేర్కొంది. ఆయన నటించిన గత సినిమా 'రాబిన్ హుడ్' ఫస్ట్ డే నాడు రూ. 4.8 కోట్ల గ్రాస్ సాధించగా తమ్ముడు కలెక్షన్స్ ఆ మార్క్‌ను కూడా చేరుకోలేకపోయింది.

భీష్మ, రంగ్ దే సినిమాల తర్వాత సరైన విజయం లేకపోవడంతో ఈ ప్రాజెక్ట్‌పై నితిన్ చాలా ఆశలు పెట్టుకున్నాడు. ఆపై దర్శకుడు వేణు శ్రీరాం కూడా ఎం.సి.ఎ, వకీల్ సాబ్ సినిమాల తర్వాత శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజుతో మూడో సినిమాగా 'తమ్ముడు' ప్రాజెక్ట్‌ను ప్లాన్ చేయడంతో అభిమానుల్లో భారీ అంచనాలు పెరిగాయి. కానీ, తమ్ముడు చిత్రం వారిని తీవ్రంగానే నిరాశపరిచింది. దీంతో మొదటిరోజు కేవలం రూ. 4 కోట్ల గ్రాస్ మాత్రమే బాక్సాఫీస్ వద్ద సాధించినట్లు పలు వెబ్‌సైట్లు ప్రకటించాయి. అయితే, కలెక్షన్ల వివరాలు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించలేదు. నితిన్ కెరీర్‌లోనే అత్యంత తక్కువ ఓపెనింగ్స్ సాధించిన చిత్రంగా తమ్ముడు నిలిచిందని సినీ వర్గాలు పేర్కొన్నాయి.

దిల్ రాజు నిర్మించిన 'తమ్ముడు' సినిమా నితిన్ కెరీర్‌ను తిరిగి ప్రారంభిస్తుందని అందరూ భావించారు. కానీ, అది వారిద్దరికీ మరో పరాజయంగా మారింది. వరుస పరాజయాలతో బాక్సాఫీస్ వద్ద నితిన్ పోరాటం కొనసాగుతోంది. ఇది అభిమానులను మాత్రమే కాకుండా చిత్ర పరిశ్రమ మార్కెట్‌ను కూడా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో గేమ్ ఛేంజర్ వల్ల భారీగా నష్టపోయిన దిల్ రాజు ఇప్పుడు మరోసారి భారీగా నష్టపోవడం తప్పదని తెలుస్తోంది. ఈ మూవీ కోసం ఆయన రూ. 50 కోట్లకు పైగానే ఖర్చు చేశారని టాక్. అయితే, తమ్ముడు సినిమా కేవలం రూ. 20 కోట్ల వరకు మాత్రమే మార్కెట్ చేసినట్లు సమాచారం.



# సైఫ్ అలీ ఖాన్‌కు హైకోర్టులో చుక్కెదురు..
## చేజారిన రూ.15 వేల కోట్లు

భోపాల్‌లోని పూర్వీకుల ఆస్తులకు సంబంధించి సైఫ్ అలీ ఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను మధ్యప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. తన ముత్తాత పాకిస్తాన్‌కు వలస వెళ్లిన కారణంగా రూ.15,000 కోట్ల విలువైన ఆస్తులను "శత్రువుల ఆస్తి"గా న్యాయస్థానం గుర్తించింది. సైఫ్ అలీ ఖాన్, ఆయన సోదరీమణులు సోహా, సబా, తల్లి షర్మిలా ఠాగూర్ తమ పూర్వీకుల ఆస్తులకు వారసులుగా గుర్తించాలని ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను మధ్యప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. దీంతో వారు రూ. 15 వేల కోట్ల ఆస్తులపై హక్కులను కోల్పోయారు. సైఫ్ అలీ ఖాన్ ఆస్తి వారసత్వ వివాదాన్ని కొత్తగా విచారించాలని, ఒక సంవత్సరం కాలపరిమితిని నిర్ణయించాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. 1947లో విభజన తర్వాత పాకిస్తాన్‌కు వలస వెళ్లిన వ్యక్తులకు సంబంధించిన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం క్లెయిమ్ చేసుకోవడానికి 1968 నాటి శత్రు ఆస్తి చట్టం అనుమతిస్తుందని హైకోర్టు గుర్తుచేసింది.

**రూ. 15 వేల కోట్ల ఆస్తి స్టోరీ ఎంటి..?**

బ్రిటిషర్లకాలంలో ఉత్తరప్రదేశ్, మధ్య ప్రదేశ్ ప్రాంతాల్లో పటౌడీ సంస్థానాన్ని పాలించిన హమీదుల్లాహ్ రాజకుటుంబానికి చెందిన రూ.15,000 కోట్ల విలువైన ఆస్తులు ఎవరి పరం కానున్నాయనే ప్రశ్న తలెత్తింది. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ పూర్వీకులకు చెందిన ఈ ఆస్తులు ఇప్పుడు ఎవరికి చెందుతాయనే అంశం మరోసారి తెరమీదకొచ్చింది. సైఫ్ వాళ్ల నానమ్మ.. పటౌడీ సంస్థానానికి అసలైన వారసురాలని సీనియర్ న్యాయవాది జగదీశ్ ఛవానీ వాదిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ వాదన దీనికి భిన్నంగా ఉంది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి భోపాల్ కేంద్రంగా పాలిస్తున్న పటౌడీ సంస్థానానికి ముహమ్మద్ హమీదుల్లాహ్ చివరి నవాబ్‌గా ఉన్నారు. ఆయన తదనంతరం ఆయన పెద్దకుమార్తె అబీదా సుల్తాన్ బేగమ్‌కు ఈ ఆస్తులు దక్కుతాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చాక విభజన సమయంలో ఆమె పాకిస్తాన్‌కు వలసవెళ్లారు. ఈ లెక్కన ఇప్పుడు వారసులు భారత్‌లో లేరు. అందుకే శత్రు ఆస్తుల చట్టం కింద ఆ ఆస్తులన్నీ ఇప్పుడు కేంద్ర హోం శాఖ పరిధిలోని భారత శత్రు ఆస్తుల సంరక్షణ సంస్థ (సీఈపీఐ) పర్యవేక్షణలోకి వస్తాయి'' అని మోదీ సర్కార్ చెబుతోంది.

# హీరోగా టూరిస్ట్ ఫ్యామిలీ దర్శకుడు..



టూరిస్ట్ ఫ్యామిలీ సినిమాతో మొదటి చిత్రంతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు అభిషన్ జీవింత్. శశి కుమార్, సిమ్రాన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ చిత్రం తమిళంలో రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా తర్వాత అభిషన్ మరో సినిమాను తెరకెక్కిస్తాడు అనుకుంటే హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఇందుకు సంబంధించిన వార్తలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. అభిషన్ హీరోగా అరంగేట్రం చేయబోతున్న ఈ సినిమాకు 'కరెక్టెడ్ మచ్చి' అనే టైటిల్ పెట్టినట్లు తెలుస్తుంది. ఇందులో మలయాళ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. అభిషన్ జీవింత్ "టూరిస్ట్ ఫ్యామిలీ" సినిమాలో ఒక చిన్న పాత్రలో నటించిన విషయం తెలిసిందే. చేసింది చిన్న పాత్రే అయిన తన నటనతో అందరిని మెప్పించాడు. అయితే ఇప్పుడు పూర్తిస్థాయి నటుడిగా మారుతుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. 'కరెక్టెడ్ మచ్చి' సినిమాకు టూరిస్ట్ ఫ్యామిలీ చిత్రానికి కో డైరెక్టర్‌గా పనిచేసిన అభిషన్ సహచరుడు దర్శకత్వం వహించనున్నారని టాక్. ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలో ఉందని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. అనస్వర రాజన్ సూపర్ శరణ్య, థగ్స్, రేఖచిత్రం, పైంకిలి వంటి చిత్రాలతో గుర్తింపు పొందింది.

## ఓ భామ అయ్యో రామా ట్రైలర్..
# హిట్ కొట్టేలా సుహాస్




టాలీవుడ్ హీరో సుహాస్, మాళవిక మనోజ్ నటించిన 'ఓ భామ అయ్యో రామా' సినిమా నుంచి తాజాగా ట్రైలర్ విడుదలైంది. ఈ ప్రేమకథ చిత్రానికి రామ్ గోదాల దర్శకత్వం వహించారు. ఈ సినిమాను వీ ఆర్ట్స్ బ్యానర్‌లో హరీశ్ నల్లా నిర్మించారు. జూలై 11న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను మెప్పించాయి. తాజాగా వచ్చిన ట్రైలర్ కూడా అంతే స్థాయిలో ఉంది. కామెడీ, లవ్, ఎమోషనల్ సీన్స్‌తో ట్రైలర్ కట్ ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. కాగా.. ఈ చిత్రంలో రవీందర్ విజయ్, బబ్లూ పృథ్వీ రాజ్, ప్రభాస్ శ్రీను, రఘు కారుమంచి, సాత్విక్ ఆనంద్, నయని పావని ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాధన్ సంగీతమందిస్తున్నారు.

# ఇండియన్ సినిమా చేయడం హ్యాపీ

'ఇండియాని చాలా మిస్ అయిపోతున్నాను. హిందీ సినిమాలను కూడా మిస్సవుతున్నాను. ఇప్పుడు ఓ ఇండియన్ ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఆ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అంటూ ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రియాంకా చోప్రా చెప్పిన విషయాలు వైరల్‌గా మారాయి. ఈ బ్యూటీ నటించిన హాలీవుడ్ చిత్రం 'హెడ్స్ ఆఫ్ స్టేట్' ఇటీవల విడుదలైంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆమె ఇండియన్ సినిమాల గురించి కూడా మాట్లాడారు. "ఇండియాలో 2002లో నా తొలి సినిమా (తమిళ చిత్రం 'తమిళన్') తో కెరీర్ మొదలుపెట్టి, ఎన్నో రకాల సినిమాలు చేశాను. ఎందరో ప్రతిభావంతులతో సినిమాలు చేశాను. అందుకే ఈ సంవత్సరం ఇండియన్ సినిమా (మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాని ఉద్దేశించి) చేయడం చాలా ఆసక్తిగా ఉంది. భారతీయ ప్రేక్షకులు నా పై చూపించే ప్రేమ నాకెంతో విలువైనది. నాపై వారి ప్రేమ ఎప్పటికీ అలానే ఉండాలని కోరుకుంటున్నా" అని ప్రియాంకా చోప్రా పేర్కొన్నారు. హాలీవుడ్ సింగర్–యాక్టర్–మ్యూజిక్ డైరెక్టర్ నిక్ జోనస్‌ని 2018లో పెళ్లి చేసుకున్న ప్రియాంక ఆ తర్వాత భారతీయ చిత్రాలు ఎక్కువ చేయడంలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు పూర్తి స్థాయిలో మహేశ్‌బాబు–రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమాలో నటించడం పట్ల ఆమె చాలా ఆనందంగా ఉన్నారు. ఈ చిత్రం 2027 వేసవిలో విడుదలయ్యే అవకాశం ఉంది.



## సినిమాల్లో ఎంట్రీ ఇస్తున్న
# సురేశ్ రైనా..




టీమిండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. సినిమా నటుడిగా అవతారం ఎత్తేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయాన్ని రైనా స్వయంగా వెల్లడించాడు. తాను కోలీవుడ్‌లో నటించనున్నట్లు తెలిపాడు. ఇందుకు సంబంధించి తమిళ సినిమా నిర్మాణ సంస్థ నుంచి శనివారం అధికారిక ప్రకటన వెలువడింది. డ్రీమ్ నైట్ స్టోరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సారథ్యంలో తెరకెక్కనున్న ఈ మూవీలో రైనాకు స్వాగతం పలుకుతున్న వీడియోను క్రికెటర్ శివం దూబే చేతుల మీదుగా విడుదల చేశారు.

**క్రికెట్ మైదానం నుంచి.. కోలీవుడ్ ఫ్రేమ్స్ దాకా..**

ఈ నేపథ్యంలో సురేశ్ రైనా స్పందిస్తూ.. ''క్రికెట్ మైదానం నుంచి.. కోలీవుడ్ ఫ్రేమ్స్ దాకా.. చెన్నై నాలో నిండి నన్ను ముందుకు నడిపిస్తోంది. నా ఈ కొత్త ప్రయాణంలో డీకేఎస్ సంస్థతో జట్టుకట్టడం ఎంతో గర్వంగా ఉంది'' అని ఎక్స్ వేదికగా పేర్కొన్నాడు. కాగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన సురేశ్ రైనా.. 2005 నుంచి 2018 వరకు టీమిండియాకు ప్రాతినిథ్యం వహించాడు. అంతర్జాతీయ స్థాయిలో 226 వన్డేలు, 78 టీ20లు, 18 టెస్టులు ఆడిన రైనా.. ఆయా ఫార్మాట్లలో 5615, 1604, 768 పరుగులు సాధించాడు. ఇక ఈ లెఫ్టాండర్ బ్యాటర్‌కు ఐపీఎల్‌లో ఘనమైన రికార్డు ఉంది. క్యాష్ రిచ్ లీగ్‌లో మొత్తంగా 205 మ్యాచ్‌లు ఆడిన రైనా.. 5528 పరుగులు సాధించి మిస్టర్ ఐపీఎల్‌గా గుర్తింపు పొందాడు.

**చిన్న తలాగా అభిమానుల హృదయాల్లో చోటు**

ఇక ఐపీఎల్ కెరీర్‌లో చాలా ఏళ్ల పాటు చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహించిన సురేశ్ రైనా.. చిన్న తలాగా గుర్తింపు పొందాడు. మహేంద్ర సింగ్ ధోని తర్వాత అంతటి స్థాయిలో చెన్నై అభిమానులను సంపాదించుకున్నాడు. ఇప్పుడు అక్కడి నుంచే తన సినీ ప్రయాణం కూడా మొదలుపెట్టనున్నాడు.

**సంతోషంగా ఉంది**

తాను తమిళ సినిమా ద్వారా అరంగేట్రం చేయడం గురించి సురేశ్ రైనా మాట్లాడుతూ.. ''దర్శకుడు నా దగ్గరకు వచ్చి కథ చెప్పినపుడు అది నా మనసుకు ఎంతో దగ్గరగా అనిపించింది. క్రికెట్‌కు సంబంధించిన ఈ సినిమాలో నటించడం గర్వకారణం. అది కూడా ఎన్నో ఏళ్లుగా సీఎస్‌కేకు ఆడి.. తమిళనాడు నుంచి నా సినిమా ప్రయాణం మొదలుపెట్టడం మరింత సంతోషంగా ఉంది. ఇక్కడి ప్రజలు మాపై ఎంతో ప్రేమను కురిపించారు'' అని పేర్కొన్నాడు. కాగా సురేశ్ రైనా నటిస్తున్న తమిళ చిత్రానికి లోగాన్ దర్శకుడు కాగా.. సంతోష్ నారాయణన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇదిలా ఉంటే.. టీమిండియా మరో మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ కూడా కోలీవుడ్ సినిమాలో నటించిన విషయం తెలిసిందే.

# ముప్పై రోజులు... మూడు ప్రదేశాలు



'తండేల్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్‌సీ 24' (వర్కింగ్ టైటిల్). 'విరూపాక్ష' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెండో షెడ్యూల్ హైదరాబాద్‌లో ఆరంభమైనట్లు చిత్రయూనిట్ తెలిపింది. "మిస్టిక్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ఎన్‌సీ 24'. అన్నపూర్ణ స్టూడియోలో వేసిన ప్రత్యేకమైన గుహ సెట్‌లో ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేశాం. రషెస్ చాలా బాగా వచ్చాయి. ఇప్పుడు మరింత ఉత్సాహంతో హైదరాబాద్‌లో రెండవ షెడ్యూల్‌ను ప్రారంభించాం. ముప్పై రోజుల పాటు హైదరాబాద్‌లోని మూడు ప్రధాన ప్రదేశాల్లో షూటింగ్ ప్లాన్ చేశాం. ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ఇతర నటీనటులపై కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నాం. చైతన్య కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రం ఇది'' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ బి. లోక్‌నాథ్, కెమెరా: రాగుల్ ధరుమన్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com